మెదక్ | సంగారెడ్డి | సిద్దిపేట

వార్త

## నేడు పటాన్‌చెరువుకు మంత్రి హరీష్‌రావు రాక

### గాంధీ థీమ్ పార్కు, లయన్స్ క్లబ్ ప్రారంభోత్సవాలు : ఎమ్మెల్యే

**పటాన్‌చెరువు, అక్టోబరు 1, ప్రభాతవార్త:** ఈ నెల 2వ తారీఖున రాష్ట ఆర్థిక, వైద్య ఆరోగ్య శాఖామాత్యులు తన్నీరు హరీష్‌రావు పటాన్‌చెరువుకు హాజరవు తున్నట్లు పటాన్‌చెరువు శాసన సభ్యులు గూడెం మహిపాల్‌రెడ్డి తెలిపారు. ఎమ్మెల్యే కథనం ప్రకారం...5 కోట్ల 10 లక్షల రూపాయలతో నిర్మించిన గాంధీ థీమ్ పార్కు, నవయుగ హనుమాన్ వ్యాయామశాల, ట్రాయంగిల్ పార్కు, 8లక్షల రూపాయలతో ఏర్పాటు చేసిన కొండా లక్ష్మణ్ బాపూజీ విగ్రహావిష్కరణ, లయ న్స్ క్లబ్ నూతన భవనాలను మంత్రి హరీష్‌రావు ప్రారంభించనున్నట్లు పేర్కొ న్నారు. ప్రారంభోత్స వా కార్యక్రమంలో రాష్ట్ర చేనేత అభివృద్ధి సంస్థ చైర్మన్ చింత ప్రభాకర్, మెదక్ పార్లమెంట్ సభ్యులు కొత్త ప్రభాకర్‌రెడ్డి, ఎమ్మెల్సీ రమణ, శాసన మండలి మాజీ చైర్మన్ వి భూపాల్‌రెడ్డిలు ముఖ్య అతిథులుగా పాల్గొంటారన్నారు. నియోజకవర్గంలోని టిఆర్‌ఎస్ పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని జయవంతం చేయాలని ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి సూచించారు.

## హత్యాయత్నం చేసిన వ్యక్తిపై కేసు నమోదు

**పెద్దశంకరంపేట, అక్టోబర్1 ప్రభాతవార్త:** ద్విచక్ర వాహనంపై వెళ్తున్న వ్యక్తిని లారీతో ఢీకొట్టి చంపేందుకు యత్నించిన వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ బాలరాజు తెలిపారు. ఎస్ఐ బాలరాజు తెలిపిన కథనం ప్రకారం మండలంలోని బద్దారం గ్రామ సర్పంచి నాగమణి భర్త విఠల్‌గౌడ్ శుక్రవారం సాయంత్రం అదే గ్రామానికి చెందిన జయంత్ అనే యువకుని ద్విచక్ర వాహనంపై పెద్దశంకరంపేట నుండి వారి స్వగ్రామం బద్దారం వెళ్తుండగా అదే గ్రామానికి చెందిన గాజుల రవీందర్ అనే వ్యక్తి వీరిని లారీతో వెంబడించాడు. పెద్దశంకరంపేట శివారులోని 133 కేవీ ఉపకేంద్రం వద్ద ద్విచక్ర వాహనాన్ని లారీతో ఢీకొట్టగా ఇద్దరు రహదారి పక్కకు పడిపోయారు. ఈ ప్రమాదంలో విఠల్, జయంత్‌లు స్వల్ప గాయాలతో బయటపడ్డారు. రవీందర్ పాత కక్ష్యలను మనస్సులో ఉంచుకొని తమను లారీతో ఢీకొట్టి చంపేందుకు ప్రయత్నించాడని విఠల్‌గౌడ్ ఇచ్చిన ఫిర్యాదుతో హత్యాయత్నం కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.



సమావేశంలో మాట్లాడుతూ కలెక్టర్ శరత్, పాల్గొన్న అదనపు కలెక్టర్లు

## ప్రజల వినతులపై సత్వర చర్యలు చేపట్టాలి

### కలెక్టర్ అధికారులకు సూచన

**సంగారెడ్డి బ్యూరో, అక్టోబర్ 1, ప్రభాతవార్త:** వివిధ సందర్భాలలో జిల్లాకు వచ్చిన సమయంలో ప్రజలు మంత్రికి ఇచ్చిన వినతులపై ఆయా శాఖల అధికారులు సత్వర చర్యలు చేపట్టి పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ శరత్ అధికారుకలు సూచించారు. శనివారం కలెక్టరేట్ మినీ సమావేశ మందిరంలో ఆయా జిల్లా అధికారులతో మంత్రికి ఆయా సం దర్భాలలో ప్రజలు పలు ప్రతిపాదనలతో ఇచ్చిన వివిధ దరఖాస్తులపై తీసుకున్న చర్యలపై సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ శరత్ మాట్లాడుతూ ఆయా శాఖల అధికారులు సంబంధిత అంశాలపై ప్రత్యేక దృష్టి సారించి పూర్తి చేయా లని, తమ పరిధిలో లేనట్లయితే ఆయా ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపాలని కోరారు. ఈ సమీక్షలో అదనపు కలెక్టర్లు రాజర్షి షా, వీరారెడ్డి, డిఆ ర్‌ఓ రాధికా రమణి, డిఆర్‌డిఓ శ్రీనివాస్ రావ్, డిపిఓ సురేష్ మోహన్, డిఎం అండ్‌హెచనఓ డాక్టర్ గాయత్రి దేవి, మిషన్ భగీరథ ఎస్ఈ రఘువీర్, ఉద్యా నశాఖ ఏడి సునీత, రెవెన్యూ డివిజనల్ అధికారులు నగేష్, రమేష్ బాబు తదితరులు పాల్గొన్నారు.

## (నిమ్జ్)కు కేటాయించిన భూమిలో సమస్యలను పరిష్కరించండి : కలెక్టర్

**సంగారెడ్డి బ్యూరో, అక్టోబర్ 1, ప్రభాతవార్త :** వెమ్ టెక్నాలజీస్ (నిమ్జ్) కు కేటాయించిన భూమిలో సమస్యలను పరిష్కరించడానికి ఆయా అధికారులు తగిన చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ శరత్ సంబంధిత అధికారులకు సూచించారు. శనివారం కలెక్టరేట్ మినీ సమావేశ మందిరంలో అదనపు కలెక్టర్లు మినీ సమావేశ మందిరంలో అదనపు కలెక్టర్లు రాజర్షి షా, వీరారెడ్డి లతో కలిసి టిఎస్ఐఐసి, పరిశ్రమలు, ఆర్‌అండ్‌బి, విద్యుత్, మిషన్ భగీరథ, ల్యాండ్ సర్వే అధికారులు, జహీరాబాద్ ఆర్డిఓ, డిఎస్‌పి లతో వెమ్ టెక్నాలజీఎస్‌కు కేటాయించిన భూమి, మిగిలిన భూసేకరణ, రీ రూటింగ్ ఫైనలైజేషన్, ఎలక్ట్రిక్ లైన్స్ ఎస్టిమేషన్, నైపుణ్యఅభివృద్ధి శిక్షణ కేంద్రం ప్రారంభం, తదితర అంశాలపై సమీక్షించి దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ నిమ్జ్ వెమ్ టెన్నాలజీస్ సంస్థకు కేటాయించిన భూమిలో ఏవేని సమస్యలు ఉంటే త్వరితగతిన పరిష్కరించాలని, రోడ్డు రీ రూటింగ్ ఫైనల్ చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. విద్యుత్ లైన్స్ కోసం ఈ నెల 7 లోగా ఎస్టిమేషన్ ఇవ్వాలని విద్యుత్ శాఖ అధికారులకు ఆదేశించారు. మిగిలిన భూసేకరణను వేగవంతం చేయాలన్నారు. భూమి కోల్పోయిన కుటుంబాల నిరుద్యోగ యువతకు నైపుణ్య అభివృద్ధి శిక్షణకై వెమ్ టెక్నాలజీస్ (నిమ్జ్) నైపుణ్య శిక్షణ కేంద్రం వెంటనే ప్రారంభించాలని కలెక్టర్ సూచించారు. ఈ సమీక్షలో ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

## తెలంగాణలో పువ్వులను పూజించడం గొప్ప సంస్కృతి : సీపీ



తీరొక్క పూలతో పేర్చిన బతుకమ్మను తీసుకవస్తున్న సీపీ శ్వేత

**సిద్దిపేట, ప్రభాతవార్త ప్రతినిధి :** పువ్వులను పూజించడం తెలంగాణలో గొప్ప సంస్కృతి అని సీపీ ఎన్.శ్వేత అన్నారు. సిద్దిపేట పోలీసు కమిషనరేట్‌లో శనివారం సాయంత్రం నిర్వహించిన బతుకమ్మ సంబరాలను అమె కలెక్టర్ సతీమణి జ్యోతితో కలిసి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించి కుటుంబ సభ్యులతో కలిసి బతుకమ్మ అడిపాడారు. ఈ సందర్భంగా అమె మాట్లాడుతూ బతుకమ్మ బతుకుని కొలిచే పండుగ అని ఎక్కడైనా దేవుళ్లకు పూలు పెట్టి కొలుస్తామని కానీ పువ్వులనే దేవతగా కొలిచే సాంప్రదాయం తెలంగాణలో మాత్రమే ఉందన్నారు. తెలంగాణ స ంస్కృతికి, చారిత్రక చిహ్నం బతకమ్మని, తెలంగాణ సంస్కృతికి అద్దం పట్టే బతుకమ్మ వేడుకలు ప్రపంచ వ్యాప్తంగా ప్రాచుర్యం పొందుతున్నాయన్నారు. తెలంగాణ నేలపై బతుకమ్మ పండుగను శతాబ్దాలుగా జరుపుకుంటున్నారని తెలిపారు. బతుకమ్మ ఉయ్యాలో అని సాగే పాటలు వినిసొంపుగా ఉంటాయన్నారు. పోలీసు కమిషనరేట్‌లో పోలీసు కుటుంబీకులతో అంగరంగ వైభవంగా బతుకమ్మ సంబరాలు జరుపుకోవడం సంతోషంగా ఉందని బతుకమ్మ పండుగ శుభాకాంక్షలు తెలిపారు. పోలీసు సిబ్బంది కుటుంబ సభ్యులతో బతుకమ్మ సంబరాలలో పాల్గొని కోలాటం, బతుకమ్మ అడి అందరిలో ఉత్సవాన్ని నింపారు. జిల్లా కలెక్టర్ ప్రశాంత్ జీవన్ పాటిల్, అడిషనల్ డీసీపీ అడ్మిన్ సందెపొగు మహేందర్, ఏసీపీలు చల్లా దేవరెడ్డి, సతీష్, రమేష్, సీఐలు రవికుమార్, భానుప్రకాష్, బిక్షపతి, కృష్ణ, దుర్గ, కానిస్టేబుళ్లు స్వాతి, పోలీసు కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## మత్స్యకారుల సంక్షేమానికి సిఎం కెసిఆర్ పెద్ద పీట

### ఎంపి కొత్త ప్రభాకర్‌రెడ్డి

**దుబ్బాక, అక్టోబర్ 1, ప్రభాతవార్త :** ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత సిఎం కెసిఆర్ మత్స్యకారుల సంక్షేమానికి పెద్ద పీట వేస్తున్నారని మెదక్ ఎంపి, జిల్లా టిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు కొత్త ప్రభాకర్‌రెడ్డి అన్నారు. దుబ్బాక మున్సిపాలిటీ పరిధిలోని గంగమ్మ పెద్ద చెరువులో శనివారం చేప పిల్లలను వదిలారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ టిఆర్ఎస్ అధికారంలోకి వచ్చిన తర్వాత సిఎం కెసిఅర్ మత్స్యకారుల సంక్షేమానికి అర్థికాభివృద్ధికి ఉచితంగా చెరువు, కుంటల్లో చేప పిల్లలను ఉచితంగా పంపిణీ చేస్తున్నారని తెలిపారు. మత్స్యకారులకు సబ్సిడీపై వాహనాలు, వలలు పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకుని మత్స్యకారులు అర్థికంగా ముందుకు రావాలన్నారు. మున్సిపల్ చైర్మన్ గన్నె వనతిభూంరెడ్డి, వార్డు కౌన్సిలర్లు బట్టి యాదమ్మఎల్లం, జడ్పీటిసి కడతల రవీందర్‌రెడ్డి, ఎంపిపి కొత్త పుష్పలతకిషన్‌రెడ్డి, గంగపుత్ర సంఘం రాష్ట అధ్యక్షులు వెంకటయ్య, పిఎసిఎస్ చైర్మన్ శేర్ల కైలాసం, సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షులు సద్ది రాజిరెడ్డి, జిల్లా మత్స్య శాఖ ఇంచార్జి మల్లేశం, కౌన్సిలర్లు, పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు. గంబీపూర్, శిలాజీనగర్, పద్మానాభునిపల్లి గ్రామాల్లో పలు అభివృద్ధి పనులతో పాటు పెద్దగుండవెల్లి గ్రామంలో 50 బిజెపి కార్యకర్తలు టిఆర్ఎస్‌లో చేరారు.



చెరువులోకి చేప పిల్లలను వదులుతున్న ఎంపి

# తల్లిదండ్రులు, గురువులు, పెద్దలు దేవునితో సమానం

### అదనపు కలెక్టర్ ప్రతిమ సింగ్




మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ ప్రతిమ సింగ్

**మెదక్ అర్బన్, అక్టోబర్1 ప్రభాతవార్త:** తల్లిదండ్రులు, గురువులు, పెద్దలు దేవునితో సమానమని, వారి త్యాగాల వల్ల మనం ఈనాడు సమాజంలో గౌరవంగా బ్రతకగలుగుతున్నామని, వారిని కంటికి రెప్పలా కాపాడుకోవలసిన బాధ్యత మనపై ఉందని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ప్రతిమ సింగ్ అన్నారు. ప్రపంచ వయో వృద్ధుల దినోత్సవం సందర్భంగా శనివారం స్థానిక టీఎన్‌జీవో భవన్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో జ్యోతి ప్రజ్వలన గావించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ ప్రతిమ సింగ్ మాట్లాడుతూ ఒకప్పుడు ఉమ్మడి కుటుంబాల వల్ల పిల్లల్లో దేశ సంస్కృతి, సంప్రదాయాలు తెలిసేవని, క్రమశిక్షణతో మెలుగుతూ పెద్దల పట్ల గౌరవంగా మెలిగే వారని, కానీ నేడు వివిధ కారణాల రీత్యా మానవ సంబంధాలు విచ్ఛిన్నమై, డబ్బు చుట్టూ కాలం తిరుగుతూ ఆర్థిక సంబంధాలు బలపడుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. మన తల్లిదండ్రులు, పెద్దలు జీవితంలో ఎన్నో ఒడిదుడుకులు ఎదుర్కొని, కష్ట నష్టాలకోర్చి మనను ఈ స్థాయికి తీసుకువచ్చారని, వారి త్యాగాలకు మనం ఎల్లవేళలా రుణపడి ఉండాలన్నారు. నేటి తరం పిల్లలకు పాఠశాలలు, కళాశాలల్లో కుటుంబం విలువలు, కుటుంబం పట్ల అవగాహన, తల్లిదండ్రులు, వృద్ధుల పోషణ, సంరక్షణ, వారి ఆరోగ్యం పట్ల అవగాహన కలిగించాలని జిల్లా విద్యాశాఖాధికారి, ఇంటర్మీడియట్ అధికారి, జిల్లా మహిళా శిశు సంక్షేమాధికారులకు సూచించారు. వృద్ధుల సంక్షేమం, వారి పోషణ, సంరక్షణతో పాటు జీవించే హక్కు, ఆస్తి హక్కు వంటి ఎన్నో హక్కులను 2007 చట్టంలో ప్రభుత్వం కల్పించిందని, తమ హక్కులకు భంగం కలిగితే నేరుగా అధికారులకు ఫిర్యాదు చేయవచ్చని, లేదా జాతీయ హెల్ప్‌లైన్ 14567 టోల్ ఫ్రీ నెంబర్‌కు ఫోన్ చేయవచ్చని అన్నారు. వృద్ధులు 90 ఏళ్ల పైబడి జీవిస్తున్నారంటే వారిలో ఉన్న మానసిక ధైర్యం, దృఢత్వం గుర్తించాలని, వారి పట్ల ప్రేమ, దయ, మమకారం చూపుతూ వారి అనుభవాలను తెలుసుకొని ముందు తరాలకు అందించాలని అన్నారు. అనంతరం వయోవృద్ధులను అదనపు కలెక్టర్ ప్రతిమ సింగ్ శాలువాలతో సన్మానించారు. అంతకు ముందు నర్సాపూర్, తునికి, మెదక్ తదితర వృద్ధాశ్రమాలతో పాటు వివిధ ప్రాంతాల నుండి వచ్చిన వయోవృద్ధులతో స్థానిక ఆర్డీవో కార్యాలయం నుండి టీఎన్జీవో భవన్ వరకు నిర్వహించిన ర్యాలీని జిల్లా మహిళా శిశు సంక్షేమాధికారి బ్రహ్మాజీ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో డీఆర్‌డీవో శ్రీనివాస్, స్వీప్ నోడల్ అధికారి రాజిరెడ్డి, తెలంగాణ రాష్ట్ర ఆల్ సర్వీస్ సిటిజన్ సంఘం జిల్లా ఇంచార్జి జగదీశ్ చంద్ర, అధ్యక్షులు అరుంధయ్ రాజ్, జనరల్ సెక్రటరీ శ్యామ్ సుందర్, తునికి నుండి రామానాయుడు వృద్ధాశ్రమం, మెదక్‌లోని సంధ్య నిలయం వృద్ధాశ్రయం నుండి వృద్ధులు, తదితరులు పాల్గొన్నారు.

### మధ్యతరగతి కుటుంబాలకు శాపంగా

# మార్వాడీ వ్యాపారం

### బంగారం, వెండి రుణాలపై రూ.4 మిత్తి వసూలు

### చూసీచూడనట్లు వ్యవహరిస్తున్న అధికారులు



గజ్వేల్ పట్టణంలో ఉన్న మార్వాడీ దుకాణాలు

**గజ్వేల్, అక్టోబర్ 1 (ప్రభాతవార్త):** అసలే గత రెండు సంవత్సరాల నుండి కరోనా ప్రభావంతో సతమతమవుతూ ఇప్పుడిప్పుడే కోలుకుంటున్న తరుణంలో మధ్యతరగతి కుటుంబాల్లో మార్వాడీ వ్యాపారం చిచ్చురేపుతుంది. రెక్కాడితే కానీ డొక్కాడని పేద ప్రజలు తమ అవసరాల కోసం బంగారాన్ని తాకట్టు పెడితే మార్వాడీలు వారి అవసరాన్ని ఆసరాగా తీసుకొని నూటికి మూడు రూపాయలు బంగారంకు, 4 రూపాయలు వెండికి అత్యధికంగా వడ్డీలు వసూలు చేస్తున్నారు. గజ్వేల్-ప్రజ్ఞాపూర్ పట్టణంలో మార్వాడీల వ్యాపారం రోజురోజుకు మూడు పువ్వులు ఆరు కాయలుగా కొనసాగుతుంది. నిత్యం మార్వాడీ దుకాణాలు రద్దీగా కిటకిటలాడుతున్నాయి. అసలే బతుకమ్మ, దసరా పండుగలు రావడంతో రైతులు, అమాయక ప్రజలు వారి అవసరం కోసం గిరిపెట్టిన బంగారు ఆభరణాలు తీసుకుందామని వస్తే ఇష్టంవచ్చిన రీతిలో వడ్డీలు వసూలు చేస్తున్నారు. కొందరు అయితే వారు తాకట్టుపెట్టిన నగలను విడిపించుకోలేక వడ్డీలు అధికంగా పెరగడంతో మార్వాడీలకే ఎంతోకొంతకు అమ్మివేస్తున్నారు. గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపల్ పరిధిలో దాదాపు 25 మార్వాడీ షాపులు ఉన్నాయని, రోజురోజు మార్వాడీల దుకాణాలు అధికంగా పెరుగుతున్నాయి. గతంలో సైతం కొందరు యువకులు మార్వాడీలు చేస్తున్న మోసాన్ని స్థానిక తహసీల్దార్‌కు ఫిర్యాదు చేసినా వారిలో మాత్రం చలనం లేదు. నగలు తాకట్టు పెడితే వారు ఇచ్చే రశీదులు హిందీలో రాయడంతో సామాన్య ప్రజలకు అర్థంకాక వారు అడిగినంత వడ్డీలు కడుతున్నారు. హిందీలో రశీదు ఇవ్వడంతో వారి వసూళ్ళకు అడ్డూఅదుపూ లేకుండాపోయింది. గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపల్ పరిధిలో ఉన్న మార్వాడీలు అధిక వడ్డీలు వసూలు చేస్తున్నా ఎవరూ పట్టించుకోకపోవడం బాధాకరం. మార్వాడీలు రాసే చిట్టీలపై అతనికి తప్ప ఎవరికి అర్థం కాకపోవడంతో ఏమి చేయాలో అర్థం కాక అడిగినంత డబ్బులు తాకట్టుదారులు కడుతున్నారు. మార్వాడీల దుకాణ సముదాయాలు పెరగడానికి కారణం అధిక వడ్డీలు వసూలు చేయడమే దీనికి కారణం. వీరంతా లాభార్జనే ధ్యేయంగా పనిచేస్తున్నారు. మార్వాడీలను ప్రభుత్వం కట్టడి చేయకపోతే మధ్యతరగతి కుటుంబాలు, రైతులు, అమాయక ప్రజలు ఇబ్బందులకు గురయ్యే అవకాశాలు ఉన్నాయి. అంతేకాకుండా మున్సిపల్ పరిధిలో మార్వాడీల సంఘం ఏర్పాటుచేసి అందరూ ఒకేలా వడ్డీలు తీసుకోవడం, హిందీలోనే రశీదులు రాయడం చేస్తున్నారు. చుట్టుపక్కల గ్రామాల ప్రజలు ప్రభుత్వ బ్యాంకులు, సహకార బ్యాంకులు ఉన్నప్పటికీ అధికంగా మార్వాడీల దుకాణాల్లోనే బంగారం తాకట్టు పెట్టడంతో వారికి అడ్డూఅదుపూ లేకుండా పోయింది. ఏదిఏమైనప్పటికీ సంబంధిత అధికారులు మార్వాడీ షాపులపై నిఘా ఏర్పాటుచేసి విచారణ జరిపించాలని మధ్యతరగతి ప్రజలు, రైతులు కోరుతున్నారు.



రూపాయలతో అలంకరించిన దుర్గామాత అమ్మవారు

## రూ. నాలుగున్నర లక్షలతో... లక్ష్మీదేవి అలంకరణలో దుర్గామాత

**మర్కుక్, అక్టోబర్ 1 (ప్రభాతవార్త):** దేవి నవరాత్రులను పురస్కరించుకొని మండలకేంద్రంలో గల శ్రీ రంగనాయకస్వామి దేవాలయంలో ఏర్పాటుచేసిన దుర్గామాత దేవిని నిర్వాహకులు 4 లక్షల 10వేల 48 రూపాయలతో అలంకరించగా లక్ష్మీదేవి రూపంలో అమ్మవారు భక్తులకు దర్శనం ఇచ్చారు. ఈ సందర్భంగా భక్తులు పెద్దసంఖ్యలో హాజరై లక్ష్మీదేవి రూపంలో ఉన్న అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అమ్మవారి ప్రసాదాన్ని స్వీకరించారు. ఈ సందర్భంగా ఆలయ నిర్వాహకులు, రైతుబంధు మండల అధ్యక్షుడు చంద్రశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ దుర్గామాత లక్ష్మీదేవి అలంకరణలో లక్షల రూపాయలతో అమ్మవారిని అలంకరించామన్నారు. ఈ సందర్భంగా భక్తులు పెద్దఎత్తున దర్శించుకొని అమ్మవారికి మొక్కులు చెల్లించుకున్నారని తెలిపారు. ప్రతిరోజు ప్రత్యేక అలంకరణలో అమ్మవారు భక్తులకు దర్శనమిస్తుందని తెలిపారు.

## క్రమశిక్షణతో విధులు నిర్వహించి జిల్లాకు మంచి పేరు తేవాలి : సిపి



పోలీసు గౌరవ వందనం స్వీకరిస్తున్న సీపీ శ్వేత

**సిద్దిపేట, ప్రభాతవార్త ప్రతినిధి :** వీక్లీ పరేడ్ వలన సిబ్బందికి ఫిజికల్ ఫిట్నెస్‌తో పాటు అరోగ్యాన్ని కాపాడుకోవడానికి ఎంతో మేలు చేస్తుందని సీపీ ఎన్.శ్వేత అన్నారు. చిన్నకోడూరు మండల పరిధిలోని పెద్దకోడూరు సిఎఆర్ హెడ్ క్వార్టర్‌లో జిల్లాలోని సివిల్, అర్మూడ్ రిజర్వు పోలీసు, హోంగార్డు సిబ్బందికి వీక్లీ పరేడ్‌లో శనివారం అమె పాల్గొని పోలీసు గౌరవ వందనం స్వీకరించారు. ఈ సందర్భంగా అమె మాట్లాడుతూ సమయం దొరికినప్పుడు సిబ్బంది, అధికారులు వ్యాయామం చేయడం చాల ముఖ్యమని..మంచి శక్తి సామర్థ్యాలతో ఎలాంటి అనారోగ్యానికి గురికాకుండా విధులు నిర్వహించడానికి మంచి అవకాశం ఉంటుందన్నారు. ఫిట్నెస్‌ను అనునిత్యం కాపాడుకోవాలన్నారు. పోలీసులు మంచి జీవన విధానాన్ని అలవర్చుకోవాలన్నారు. క్రమశిక్షణతో విధులు నిర్వహించి జిల్లాకు, పోలీసుశాఖకు మంచి పేరు తేవాలన్నారు. రెగ్యులర్‌గా హెల్త్ చెక్ అఫ్ చేయించుకోవాలన్నారు. రన్నింగ్, వాకింగ్ నిత్య జీవితంలో భాగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో అడిషనల్ డీసీపీ అడ్మిన్ స ందెపొగు మహేందర్, ఏఅర్ అడిషనల్ డీసీపీ సుభాష్ చంద్ర బోస్, పోలీసు అధికారులు రవీందర్‌రాజు,రాజశేఖర్‌రెడ్డి, ధరణికుమార్, రామకృష్ణ, బిక్షపతి, రవికుమార్, భాను ప్రకాష్, జానకీరామ్‌రెడ్డి, సైదా నాయక్, పుష్ప తదితరులు పాల్గొన్నారు.

## వెల్దుర్తిని ఆదర్శవంతంగా తీర్చిదిద్దుతా : ఎమ్మెల్యే



దొడ్డి కొమురయ్య విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే మదన్‌రెడ్డి

**వెల్దుర్తి, అక్టోబర్1 ప్రభాతవార్త :** నర్సాపూర్ నియోజకవర్గంలోని వెల్దుర్తి మండలాన్ని ఆదర్శ మండలంగా తీర్చిదిద్దుతామని నర్సాపూర్ ఎమ్మెల్యే చిలుముల మదన్‌రెడ్డి అన్నారు. శనివారం మండల కేంద్రమైన వెల్దుర్తిలో హైమాస్క్ లైట్లను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మదన్‌రెడ్డి మాట్లాడుతూ డబులు రోడ్డులో డివైడర్ మధ్యలో లైట్లు ఉండటంతో గ్రామం ఎంతో అందంగా ఉంటుందని, డబుల్ రోడ్డు, హైమాస్క్ లైట్ల ఏర్పాటుతో గ్రామస్థుల కళ సాకారమైందన్నారు. అలాగే వెల్దుర్తి గ్రామ పంచాయితీ పరిధిలోని శేరిలా గ్రామంలో కుర్మ కులస్తులు నూతనంగా ఏర్పాటు చేసిన దొడ్డి కొమురయ్య విగ్రహాన్ని ఎమ్మెల్యే మదన్‌రెడ్డి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మదన్‌రెడ్డి మాట్లాడుతూ తెలంగాణ సాయుధ పోరాట స్ఫూర్తి దొడ్డి కొమురయ్య అని కొనియాడారు. శేరిలా గ్రామంలో మల్లన్న ఆలయ నిర్మాణానికి 20 లక్షలు, సీసీ రోడ్డు నిర్మాణానికి 10 లక్షలు, అర్హులైన వారికి డబుల్ బెడ్‌రూం ఇండ్లు మంజూరు చేస్తామని తెలిపారు. అలాగే మండల కేంద్రమైన వెల్దుర్తిలో దుర్గామాతను దర్శించుకున్నారు. ఆలయ అర్చకులు గిరీశ్వర శర్మ పూర్ణాకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అలాగే మండలంలోని యశ్వంతరావుపేటలో తెలంగాణ తల్లి విగ్రహాన్ని ఎమ్మెల్యే మదన్‌రెడ్డి ఆవిష్కరించారు. అనంతరం పెద్దమ్మ గుడిని సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం తెలంగాణ గ్రామీణ క్రీడా ప్రాంగణాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ రమేష్‌గౌడ్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ చంద్రాగౌడ్, జెడ్పీటీసీ రమేష్‌గౌడ్, సర్పంచి భాగ్యమ్మ ఆంజనేయులు, ఎంపీటీసీ మోహన్‌రెడ్డి, మండల సర్పంచుల ఫోరం అధ్యక్షులు అశోక్‌రెడ్డి, శివ్వంపేట ఎంపీపీ హరికృష్ణ, టీఆర్ఎస్ నాయకులు నరేందర్‌రెడ్డి, ఆత్మ కమిటీ చైర్మన్ ప్రతాప్‌రెడ్డి, మండల పార్టీ అధ్యక్షులు భూపాల్‌రెడ్డి, గొర్రె వెంకట్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీ అశోక్‌గౌడ్, ఎంపీడీవో జగదీశ్వరచారి, తహశీల్దార్ సురేష్‌కుమార్, పాల్గొన్నారు.

# కాత్యాయిని దేవిగా వనదుర్గా భవానిమాత

### అమ్మవారికి ఎమ్మెల్సీ, ఎమ్మెల్యే, చైర్మన్ పూజలు

**పాపన్నపేట, అక్టోబరు 1, ప్రభాతవార్త:** మెదక్ జిల్లా పాపన్నపేట మండలంలోని ఏడుపాయల వనదుర్గా దేవి ఆలయంలో కొనసాగుతున్న దేవి శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా శనివారం వనదుర్గా భవానిమాత కాత్యాయిని దేవిగా భక్తులకు దర్శనం ఇచ్చారు. ఆలయ ఆవరణ శనివారం ప్రముఖుల రాకతో కళకళలాడింది. అమ్మవారికి బోనాలు సమర్పించే కార్యక్రమంలో ఎమ్మెల్సీ కవిత, తెలంగాణ మహిళా కమీషన్ చైర్మన్, మాజీ మంత్రి సునితా లక్ష్మారెడ్డి, మెదక్ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డిలు పాల్గొని బోనాలతో అమ్మవారి సన్నిదికి చేరకుని దుర్గమ్మకు సమర్పించారు. ఈ సందర్భంగా కమితి, సునితాలక్ష్మారెడ్డి, పద్మాదేవేందర్‌రెడ్డిలు మాట్లాడుతూ తెలంగాణ ప్రజలు సుభిక్షంగా ఉండాలని అమ్మవారిని వేడుకున్నట్లు ప్రకటించారు. ఏడుపాయల జాతర నిర్వాహణకు ప్రత్యేక నిధులు కేటాయించిన విషయాన్ని గుర్తు చేశారు. ఆలయాభివృద్ధికి సహకరించాలని ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి వినతి చేయగా తమ వంతు సహకారం అందిస్తామని ఎమ్మెల్సీ, చైర్మన్‌లు హామి చేశారు. తెలంగాణ సంస్కృతికి అద్దం పట్టే బతుకమ్మ ప్రపంచంలోని దేశాలు చేసుకోవడం తెలంగాణ గర్వకారణంగా వారు అభివర్ణించారు. కార్యక్రమంలో జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ లావణ్య రెడ్డి, తెలంగాణ జాగృతి జిల్లా అధ్యక్షురాలు మల్లిక, టిఆర్ఎస్ అధ్యక్షులు విష్ణు వర్ధన్‌రెడ్డి, గంగాధర్, జిల్లా రైతు సమితి అధ్యక్షులు సోములు, మెదక్ మున్సిపల్ చైర్మన్ చంద్రపాల్, వైస్ చైర్మన్ మల్లికార్జున్, పాపన్నపేట మార్కెట్ కమిటి చైర్మన్ వెంకట్‌రెడ్డి, సర్పంచ్, ఎంపిటిసిల ఫోరం అధ్యక్షులు జగన్, కుబేర, సర్పంచులు, నాయకులు గురుమూర్తిగౌడ్, సంజీవరెడ్డి, స్రవంతి శ్రీనివాస్, వెంకట్ రాములు, లింగారెడ్డి, స్వప్న బాలాగౌడ్, దుర్గయ్య, వెంకటేశం తదితరులు పాల్గొన్నారు.

### ఆకట్టుకున్న బోనాల ఊరేగింపు

దేవి శరన్నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని ఆలయ ఆవరణలోని గోకుల్ షెడ్ నుంచి బోనాల ఊరేగింపును నిర్వహించారు. ఎమ్మెల్సీ,ఎమ్మలేలు బోనాలను ఎత్తుకుని ఊరేగింపులో పాల్గొన్నారు. బోనాల ఊరేగింపును సాంస్కృతిక కళాకారుల బృందం ఆట పాటలతో, భాజా భజంత్రీలతో స్వాగతం పలుకుతూ ముందుకు నడిచారు.



ఎమ్మెల్సీ,ఎమ్యెల్యే, చైర్మన్‌లకు ఆశీర్వచనాలు చేస్తున్న అర్చకులు


చెక్కులను పంపిణీ చేసిన ఎమ్మెల్యే చిలుముల మదన్‌రెడ్డి

## కళ్యాణ లక్ష్మి చెక్కుల పంపిణి చేసిన ఎమ్మెల్యే

**కౌడిపల్లి, అక్టోబర్ 1, ప్రభాతవార్త:** పేద బడుగు బలహీన వర్గాల అభ్యున్నతి కోసం ఎన్నో సంక్షేమ పథకాలను ప్రవేశ పెట్టి, అమలు చేసిన ఘనత మన కేసీఆర్‌దే అని ఎమ్మెల్యే చిలుముల మదన్‌రెడ్డి పేర్కొన్నారు. శనివారం మండల సమావేశ మందిరంలో మండల పరిధిలోని ఆయా గ్రామాలకు చెందిన పలువురు లబ్దిదారులకు కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను పంపిణి చేయడానికి ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరైనారు. ఎంపిపి దలావత్ రాజునాయక్ అధ్యక్షతన కొనసాగిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతు సిఎం పేదింటి వధువు కుటుంబీకులకు ఒ అన్నలాగా ఆర్థిక సహాయం అందించడానికి కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కుల పట్ల ప్రత్యేక శ్రద్ద చూపించి, సకాలంలో లబ్దిదారులకు చెక్కులను పంపిణి చేయించుతున్నట్లు ఆయన తెలిపారు. జేడ్పిసి కవితా అమర్ సింగ్, వైస్ ఎంపిపి బోడ్ల నవీన్ గుప్తా, మండల కోఆప్షన్ సభ్యులు హైమద్, మండల పార్టీ అధ్యక్షులు సార రామాగౌడు, మహమ్మద్‌నగర్ సోసైటీ వైస్ చైర్మెన్ చిన్న చిన్నం రెడ్డి, తహశీల్దార్ వెంకటేశం, ఆయా గ్రామాలకు చెందిన సర్పంచులు, ఎంపిటీసిలు, లబ్దిదారులు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా దేవిశరన్నవ రాత్రి ఉత్సవాలు

**కౌడిపల్లి, అక్టోబర్ 1, ప్రభాతవార్త:** కౌడిపల్లి మండల వ్యాప్తంగా ఆయా గ్రామాల్లో దేవి శరన్నవ రాత్రి ఉత్సవాలను భవానీ మాలధారణ మాతలు, యువజన సంఘాల సభ్యులు మండపాలల్లో శ్రీ కనకదుర్గా విగ్రహాలను ఏర్పాటు చేసి ఉత్సవాలను ఘనంగా జరుపుకుంటున్నారు. శని వారం నాడు ఆయా గ్రామాల్లో ఆయా అవతారంలో అమ్మవారిని అలకరించి, ప్రత్యేక పూజలు నిర్వహించారు. కౌడిపల్లి గ్రామ శివారుల్లో గల శ్రీ రేణుకా ఏల్లమ్మ ఆలయంలో ఆరవ రోజున గ్రామ పురోహితులు కోలాచల రాజేశ్వర్ శర్మ, కోలాచల సృజన్ శర్మ, కోలాచల సుమన్ శర్మలు ఏల్లమ్మ మూల విరాట్ విగ్రహాన్ని శ్రీకాలికామాత ఆవతరాలంలో అంగరంగ వైభవంగా అలకంరించారు. భక్తులు పెద్ద ఎత్తున ఆలయంకు విచ్చేసి కుంకుమార్చనలు, ప్రత్యేక పూజలు జరిపించారు. శ్రీ రేణుక యేల్లమ్మ ఆలయంకు జిల్లా కోఆప్షన్ మెంబర్ మన్సూర్ అలీ, మండల కోఆప్షన్ మెంబర్ మహమ్మద్ హైమద్, టిఆర్ఎస్ నాయకులు నవీన్ రావు, నాయికోటి శ్యాం సుందర్ రావు, సార కిషోర్ గౌడు, నాయికోటి లింగంలు అమ్మవారిని దర్శించికోని ప్రత్యేక పూజలు జరిపించారు. అలాగే వెల్మకన్నె గ్రామంలోని శ్రీ బాలవీరా హన్మాన్ మందిరంలో పూజారి మెట్టు రాములు శర్మ చేతుల మీదుగా అమ్మవారిని శ్రీ లక్ష్మి ఆవతారంలో అలంకరించి, ప్రత్యేక పూజలు నిర్వహించిన తర్వాత భక్తులకు దర్శినం కల్పిం చినారు. కాగా రాయిలాపూర్, కౌడిపల్లి హన్మాన్ యువజన సంఘం, వెల్మకన్నెలో వివేకానంద యూత్‌ల ఆధ్వర్యంలో భవానీ మండపాలను ఏర్పాటు చేసి, దేవి శరన్నవరాత్రి ఉత్సవాలను అత్యంత్య వైభవంగా జరుపుతున్నారు. భవానీ మాల ధారణ స్వాములు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## బర్ధీపూర్‌లో ఘనంగా సద్దుల బతుకమ్మ సంబరాలు


బతుకమ్మ ఆడుతున్న మహిళల దృశ్యం

**టేక్మాల్, అక్టొబరు 1, ప్రభాతవార్త:** మండలంలోని బర్ధీపూర్ ఆయా గ్రామాల్లో శనివారం సద్దుల బతుకమ్మ పండుగ సంబరాలను ఘనంగా జరుకున్నారు. ఈ సందర్భంగా తెలంగాణ సాంప్రదాయం ఉట్టి పడేలా అడపడుచులు బతుకమ్మలకు రంగు రంగు పూలతో అందంగా పేర్చి నూతన వస్త్రాలు ధరించి పంచాయితీల అవరణంలో గ్రామ ప్రధాన కూడళ్ళలో బతుకమ్మలను పెట్టి బతుకమ్మ బతుకమ్మ ఉయ్యాలో..అనే రకరకాల బతుకమ్మ పాటలను పాడుతూ ఆటలాడారు. వీరి ఆటలు ఎంతగానో ఆకట్టుకున్నాయి. సమీపంలోని చెరువులో బతుకమ్మలను నిమజ్జనం చేసి..చల్లంగా దీవించి పొయిరా బతుకమ్మ అంటూ వేడుకున్నారు.

## రుణమాఫీ లబ్ధిదారులకు పాసు పుస్తకాల పంపిణీ


రుణమాఫీ లబ్ధిదారులకు పాసు పుస్తకాలను పంపిణీ చేస్తున్న దృశ్యం

**కొల్చారం, అక్టోబర్1 ప్రభాతవార్త:** కొల్చారం మండల పరిధిలోని కొంగోడ్ సహకార సంఘం ఏడీబీ పరిధిలో రుణాలు పొందిన రైతులకు 50 వేల రూపాయల రుణమాఫీ కావడంతో శనివారం సహకార సంఘం చైర్మన్ జి. కృపాకర్‌రెడ్డి రైతులకు 50 వేల రూపాయలు రుణమాఫీ అయినట్లు పట్టా పాసు పుస్తకాలను అందజేశారు. ఈ కార్యక్రమలో కార్యవర్గ సభ్యులు జి. లక్ష్మయ్య, కె. సత్యనారాయణగౌడ్, కుర్మ లక్ష్మి నర్సమ్మ, మన్నె మాణయ్య, మ్యాకల పోచమ్మ, జి. దుర్గాగౌడ్, గొల్ల అంబరీష్, దగ్గు దుర్గేష్, లంబాడి చందర్, కార్యదర్శి జి. సాయిరెడ్డి, గ్రామ సర్పంచి కె. మంజుల సత్యనారయణగౌడ్, గ్రామ పెద్దలు, రైతులు తదితరులు ఉన్నారు.

## భాజాపాతోనే అభివృద్ధి సాధ్యం


ప్రధాని మోదీ చిత్రపటానికి పాలాబిషేకం చేస్తున్న దృశ్యం

**చిన్నశంకరంపేట, అక్టోబర్ 1, ప్రభాతవార్త:** భాజాపాతోనే దేశంలో అభివృద్ధి సాధ్యం అని భాజాపా మండల అధ్యక్షుడు మంగళి యాదగిరి అన్నారు. శనివారం మండల కేంద్రంలోని స్థానిక బస్టాండ్ చౌరస్త వద్ద మోది చిత్రపటాన్ని ఏర్పాటు చేసి పాలాబిషేకం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ దేశంలోనే పేదల కోసం అనేక సంక్షేమ పథకాలను మోదీ ప్రవేశపెట్టారని, మరో మూడు నెలల పాటు కేంద్రం ఉచితంగా రేషన్ బియ్యం అందించడంపై వారు హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో భాజాపా నాయకులు సురేష్ గౌడ్, పోగుల రాజు, అశోక్, నరెందర్‌రెడ్డి, దశరథం, వనం నర్సింలు, సయ్యద్, గణేష్, ప్రవిణ్, కుమార్, భూపాల్, స్వామి, రవిందర్, మహెష్, రమేష్ తదితరులు పాల్గోన్నారు.


లబ్ధిదారులకు కళ్యాణలక్ష్మీ చెక్కులను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే మదన్‌రెడ్డి

## సిఎంకు ఇష్టమైన పథకం కళ్యాణలక్ష్మీ, షాదీముబారక్

**నర్సాపూర్ ఎమ్మెల్యే చిలుముల మదన్‌రెడ్డి**

**కొల్చారం, అక్టోబర్1 ప్రభాతవార్త:** ముఖ్యమంత్రి కేసీఆర్‌కు అత్యంత ఇష్టమైన పథకం కళ్యాణలక్ష్మీ, షాదీముబారక్ పథకం అని నర్సాపూర్ ఎమ్మెల్యే చిలుముల మదన్‌రెడ్డి, కొల్చారం ఎంపీపీ అధ్యక్షురాలు మంజులలు అన్నారు. శనివారం మండల కేంద్రమైన కొల్చారంలోని మండల పరిషత్ కార్యాలయంలో తహశీల్దార్ చంద్ర శేఖర్‌రావు ఆధ్వర్యంలో కళ్యాణలక్ష్మీ, షాదీముబారక్ చెక్కుల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే మదన్‌రెడ్డి ముఖ్య అతిథిగాహాజరయ్యారు. అనంతరం ఎమ్మెల్యే మదన్‌రెడ్డి స్థానిక ప్రజాప్రతినిధులు చేతుల మీదుగా 55 మంది లబ్ధిదారులకు కళ్యాణలక్ష్మీ, షాదీముబారక్ చెక్కులను పంపిణీ చేశారు. మండల పార్టీ అధ్యక్షులు రాంపల్లి గౌరీశంకర్, రెవెన్యూ సిబ్బంది శ్రీహరి, అశ్విని, సర్పంచులు వీరారెడ్డి, విష్ణువర్ధన్‌రెడ్డి, చలం ఝాన్సీ యాదగిరి, మన్నె శ్రీనివాస్, రాజాగౌడ్, వైస్ ఎంపీపీ అల్లు మల్లారెడ్డి, టీఆర్ఎస్ పార్టీ నేతలు ఇంద్రసేనారెడ్డి, విజయ్ భాస్కర్‌రెడ్డి, గజిని వెంకట్‌గౌడ్, జూనియర్ అసిస్టెంట్ అశ్విని, ఎంపీటీసీ ఎల్లయ్య, టీఆర్ఎస్ నాయకులు వడ్ల ప్రభాకర్, ఆయా గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీలు, టీఆర్ఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## మున్సిపల్ కమిషనర్‌పై పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు


పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తున్న యూత్ కాంగ్రెస్, బీజేవైఎం నాయకులు

**మెదక్ మున్సిపాలిటీ, అక్టోబర్1 ప్రభాతవార్త:** మెదక్ పట్టణంలోని పోలీస్ స్టేషన్‌లో శనివారం మెదక్ మున్సిపల్ కమీషనర్ మీద యువజన కాంగ్రెస్, బీజేవైఎం ఆధ్వర్యంలో పట్టణ సీఐకి ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మెదక్ పట్టణంలో వివిధ పార్టీల వారు ఏర్పాటు చేస్తున్న ప్లెక్సీల విషయంలో మున్సిపల్ కమీషనర్ అధికార పార్టీకి ఒక విధానం, ఇతర పార్టీలకు ఒక విధానం పాటిస్తున్నారని దుయ్యబట్టారు. ప్రతిపక్ష పార్టీలు, వివిధ వర్గాల వారు బోనాల సమయంలో ఏర్పాటు చేసే ఫ్లెక్సీలను ఒక్క రోజులోనే తొలగిస్తున్నారని, అదే అధికార పార్టీ ఏర్పాటు చేసే ఫ్లెక్సీలను నెలల తరబడి ఉంచుతున్నారన్నారు. ఒక అధికారిగా ఉండి టీఆర్ఎస్‌కు ఒక నిబంధన, ఇతర పార్టీలకు ఒక నిబంధనను అవలంబిస్తూ మున్సిపల్ కమీషనర్ అధికారాన్ని దుర్వినియోగం చేస్తున్నారని అన్నారు. మెదక్ పట్టణంలో ఫ్లెక్సీలను పూర్తిస్థాయిలో బ్యాన్ చేయాలని, లేకపోతే అన్ని రాజకీయ పార్టీలకు వేసుకొనే వెసలుబాటు కల్పించాలని డిమాండ్ చేశారు. ఇలా అధికార పార్టీకి అనుకూలంగా వ్యవహరించడం సరైన విధానం కాదన్నారు. ఈ కార్యక్రమంలో యువజన కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు మహేందర్‌రెడ్డి, బీజేవైఎం జిల్లా అధ్యక్షులు సందీప్ రమాకాంత్, యువజన కాంగ్రెస్ అసెంబ్లీ అధ్యక్షులు రమేష్‌గౌడ్, జిల్లా ప్రధాన కార్యదర్శులు ప్రేమ్ కుమార్, దయాసాగర్, భూపతి, శివకుమార్, మన్సూర్, రాహుల్, ఆదిల్, వంశీ, ప్రభాకర్, దాస్, గణేష్, సూర్య తదితరులు పాల్గొన్నారు.

## బతుకమ్మ సంబరాల్లో ఎమ్మెల్యే మదన్‌రెడ్డి


బతుకమ్మను ఎత్తుకున్న ఎమ్మెల్యే మదన్‌రెడ్డి తదితరులు

**నర్సాపూర్, అక్టోబర్ 1, ప్రభాతవార్త:** తెలంగాణ సంస్కృతి సాంప్రదాయాలను చాటేలా భక్తి శ్రద్ధలతో బతుకమ్మ సంబరాలు జరుపకుంటున్నట్లు ఎమ్మెల్యే చిలుముల మదన్‌రెడ్డి అన్నారు. శనివారం నర్సాపూర్ పట్టణంలోని చిల్డ్రన్ పార్క్‌లో నర్సాపూర్ ఐసిడిఎస్ అధ్వర్యంలో ఏర్పాటు చేసిన తెలంగాణ బతుక మ్మ సంబరాలను ఘనంగా నిర్వహించారు. ఈకార్యక్రమానికి ఎమ్మెల్యే మదన్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరైబారీ బతుకమ్మ కు ప్రత్యేక పూజలు చేశారు.

**కళ్యాణ లక్ష్మి చెక్కులు పంపిణీ చేసిన ఎమ్మెల్యే**

నర్సాపూర్‌లోని మండల పరిషత్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో ఎమ్మెల్యే చిలుముల మదన్‌రెడ్డి చేతుల మీదుగా కళ్యాణలక్ష్మి, షాధీముబారక్ చెక్కులను పంపిణీ చేశారు. ఈమేరకు మండల పరిదిలోని వివిధ గ్రామాలకు చెందిన లబ్దిదారులకు కళ్యాణలక్ష్మి, షాధీముబారక్ చెక్కులు అందజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో సిడిపిఒ హేమాబార్గవి, ఎంపిపి జ్యోతి సురేష్‌నాయక్, జడ్‌పిటిసీ బాబ్యానాయక్, ఆత్మ కమిటీ చైర్మన్ గొర్రె వెంకట్‌రెడ్డి, టిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు పైడి శ్రీధంగుప్త, సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షులు జితేందర్‌రెడ్డి, సర్పంచ్‌లు శివకుమార్, సామ్యానాయక్, సేనాధిపతి, ఉప్పలపు అశోక్, నాయకులు మదన్‌మోహన్. ఐసిడిఎస్ సూపర్ వైజర్ సరళాకుమారి, అంగన్‌వాడి టీచర్‌లు అన్నపూర్ణ, వరలక్ష్మి, నాగరాణి, పద్మ తదితరులు పాల్గొన్నారు.

## భక్తి శ్రద్ధలతో బతుకమ్మ పండుగ

**కల్హేర్, అక్టోబర్ 1 ప్రభాతవార్త:** నారాయణఖేడ్ నియోజకవర్గంలోని నూతనంగా ఏర్పాటైన నిజాంపేట మండలంలోని బల్కం చెల్క తండాలో (భక్తదాం తండా)లోని విశ్వమాలిని జ్వాల ముఖి దుర్గామాత సంత్ సేవాలాల్ మందిరాన్ని శనివారం ఎమ్మెల్సీ కవిత దర్శించుకున్నారు. నారాయణఖేడ్ నియోజకవర్గంలోని నలుమూలల నుంచి మహిళలు అధిక సంఖ్యలో తరలివచ్చారు. కళాకారుల ప్రదర్శనలతో ప్రాంగనమంతా మార్మోగింది. తెలంగాణ సంస్కృతి ప్రతిభింబించేలా కళాకారుల ప్రదర్శనలతో ప్రాంగణమంతా మారుమోగింది. ఎమ్మెల్సీ కవిత బతుకమ్మ పండగ కార్యక్రమానికి హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి హారతిచ్చి వేడుకలను ప్రారంభించారు. ఎమ్మెల్యే ఎం.భూపాల్‌రెడ్డి సతీమణి జయశ్రీరెడ్డిలు కలిసి స్వాగతం పలికారు. గిరిజన మహిళలతో కూడి వివిధ గ్రామాల నుంచి తరలివచ్చిన గిరిజన మహిళలతో కలిసి బతుకమ్మ పండుగలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటైన సమావేశంలో ఆమె మాట్లాడుతూ బతుకమ్మ పండుగ జాగృతి గురించి ఎమ్మెల్సీ కవిత వివిధ అంశాలలో వివరించారు. తెలంగాణ బతుకమ్మ సంబురాలు అంటేనే ఆడబిడ్డతో సమానమని గుర్తు చేశారు. తెలంగాణ రాష్ట్రంలో బతుకమ్మ పండుగను ఆనావాయితీగా వస్తున్న మహిళలకు సంతోషకరమైన పండుగ అని అన్నారు. సంగారెడ్డి జిల్లా తెరాస పార్టీ అధ్యక్షులు చింత ప్రభాకర్, రాష్ట్ర జాగృతి అధ్యక్షురాలు చింతల గీతారెడ్డి, రాష్ట్ర అధ్యక్షులు మఠం భిక్షపతి, అరుణ్‌రాజ్, గ్రామ సర్పంచ్ మూడ్ లలిత కిషన్, నిజాంపేట సర్పంచ్ జగదీశ్వర చారీ, ఎంపీపీలు, జడ్పీటీసీలు, సర్పంచ్‌లు, ఎంపిటీసీలు పాల్గొన్నారు.


బతుకమ్మ ఎత్తుకున్న ఎమ్మెల్సీ కవిత


చీరలు పంపిణీచేస్తున్న ఎంపిపి, జెడ్‌పిటిసిలు

## గంగాపూర్‌లో బతుకమ్మ చీరల పంపిణీ

**మర్కుక్, అక్టోబర్ 1 (ప్రభాతవార్త):** మండల పరిధిలోని గంగాపూర్–యూసుఫ్‌ఖాన్‌పల్లిలో సర్పంచ్ గడ్డం ప్రసాద్ ఆధ్వర్యంలో శని వారం ఎంపిపి పాండుగౌడ్, జెడ్‌పిటిసి మంగమ్మరాంచంద్రంల చేతుల మీదుగా మహిళలకు బతుకమ్మ చీరలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ టిఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పండుగలు అధికారికంగా నిర్వహిస్తున్నారని, అలాగే ఎన్నో అభివృద్ధి సంక్షేమ పథకాలు అన్ని వర్గాల ప్రజలకు చేకూరేలా ఉన్నాయని, ఇవి ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా నిలిచాయన్నారు. గ్రామపంచాయతీ పాలకవర్గ సభ్యులు, కార్యదర్శి, గ్రామస్తులు పాల్గొన్నారు.

## బీజేపీ ఆధ్వర్యంలో గుజరాతీల ఆత్మీయ సమ్మేళనం


గుజరాతీలను సన్మానిస్తున్న బీజేపీ జిల్లా అధ్యక్షులు గడ్డం శ్రీనివాస్

**మెదక్ అర్బన్, అక్టోబర్1 ప్రభాతవార్త:** ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ జన్మదినం సందర్భంగా సెప్టెంబర్ 17 నుండి అక్టోబర్ 2 వరకు నిర్వహించబడుతున్న సేవాపక్షంలో కార్యక్రమంలో భాగంగా జిల్లా కేంద్రం మెదక్‌లో బీజేపీ జిల్లా అధ్యక్షులు గడ్డం శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఏక్ భారత్.. శ్రేష్ట భారత్‌లో భాగంగా భిన్నత్వంలో ఏకత్వంగా వివిధ మతాల వారు, కులాల వారు, వివిధ భాషలు మాట్లాడే వారు అందరం కలిసి భారతదేశంలో కలిసి జీవించడం గర్వ కారణమని, ఈ విషయాన్ని ప్రపంచలోని అన్ని దేశాలకు తెలియజేసే విధంగా ప్రయత్నిస్తున్న తరుణంలో శనివారం గుజరాతీల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా వారిని సన్మానించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి నల్లాల విజయ్ కుమార్, బీజేపీ సీనియర్ నాయకులు తాళ్లపల్లి రాజశేఖర్, పట్టణ అధ్యక్షులు నాయిని ప్రసాద్, జిల్లా నాయకులు వడ్ల జనార్ధన్, ఎక్కలదేవి మధుసూదన్, బెండల నిఖిల్, కల్కి నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

## గిరిజనులకు 10 శాతం రిజర్వేషన్‌లు పెంచడం పట్ల హర్షం

**నర్సాపూర్,, అక్టోబర్ 1 .ప్రభాతవార్త:.** గిరిజనులకు 6 శాతం నుండి 10 శాతం రిజర్వేషన్‌లు పెంచడం పట్ల ఆల్‌ఇండియా బంజారా ఎంప్లాయిస్ యూనియన్ సేవా సంఘం మెదక్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఎం. చాందీరామ్, ఎం.సామ్యానాయక్ లు హర్షం వ్యక్తం చేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ సిఎం కెసిఆర్ ఇచ్చిన హామీ మేరకు గిరిజనులకు రిజర్వేషన్‌లు 6 శాతం నుండి 10 శాతం పెంచినందుకు తెలంగాణ రాష్ట్రంలోని ఉద్యోగ ఉపాధ్యాయులు, గిరిజన జాతీ ఎల్లప్పుడు సిఎం కెసిఆర్ కు రుణపడి ఉంటామని అన్నారు.అదేవిదంగా గిరిజనుల రిజర్వేషన్ లపెంపునకు అహర్నిషలు కృషి చేసిన మంత్రివర్యులు సత్యవతి రాథోడ్ ,శాసన సభ్యులకు, వివిద సంఘాల నాయకులకు ఆల్‌ఇండియా బంజారా ఎంప్లాయిస్ సేవాసంఘం తరపున కృతజ్ఞతలు తెలియజేశారు.

## నిరంతర విద్యుత్ అందించండి


విద్యుత్ శాఖ ఏఈ సతీష్‌కు వినతి పత్రం అందిస్తున్న దృశ్యం

**చిన్నశంకరంపేట, అక్టోబర్ 1, ప్రభాతవార్త:** నిరంతర త్రీ ఫెజ్ విద్యుత్ అందించక పోవడంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని భాజాపా కిసాన్ మోర్చ మండల అధ్యక్షుడు గణేష్ నాయక్ తెలిపారు. శనివారం చిన్నశంకరంపేటలో ఆయన మాట్లాడుతూ విద్యుత్ సరఫరా ఎప్పుడు వస్తుందో, ఎప్పుడు పోతుందో తెలియని అయోమయ స్థితిలో అన్నదాతలు ఉన్నారని దాని ద్వార పంట పోలాలు ఎండిపోయి తీవ్రంగా నష్టపోతున్నారని అన్నారు. అనంతరం విద్యుత్ శాఖ ఏఈ సతిష్‌కు వినతి పత్రం అందించారు. ఈ కార్యక్రమంలో యాదగిరి. సురేష్, పోగుల రాజు, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

## వీరశైవ లింగాయత్‌లందరు ఛలో కోకాపేట


సమావేశంలో మాట్లాడుతున్నసమాజ్ ప్రధాన కార్యదర్శి జయప్రకాష్

**సదాశివపేట, అక్టోబర్ 1, ప్రభాతవార్త:** సదాశివపేట పట్టణంలో శనివారం వీరశైవ లింగాయత్‌ల సమావేశం ఏర్పాటు చేశారు ఈ సమావేశంలో సంగారెడ్డి జిల్లా వీరశైవ లింగాయత్ సమాజ్ ప్రధాన కార్యదర్శి అన్నిశెట్టి జయప్రకాష్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలోని వీరశైవ లింగాయత్‌లు ఎన్నో రోజుల నుండి ఎదురుచూస్తున్న బసవ భవన్ కళ సాకారం కాబోతుంది నేడు మన వీరశైవ లింగాయత్‌ల ముద్దుబిడ్డ జహీరాబాద్ శివశ్రీ బిబిపాటిల్ సారథ్యంలో తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఇచ్చిన హమి మేరకు బ్యాంక్ బండ్‌పైన బసవేశ్వర కాంస్య విగ్రహం, కోకాపేట్‌లో ఒక ఎకరా స్థలం పది కోట్ల రూపాయలు మంజూరు చేశారు. అక్టోబర్ 2న ఈ బసవ భవన్ భూమి పూజ నిర్వహించడం జరుగుతుంది. కాబట్టి జిల్లాలోని వీరశైవ లింగాయత్‌లు అందరు తనవంతుగా తరలివచ్చి ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సంగారెడ్డి జిల్లా వీరశైవ లింగాయత్ సమాజ్ ప్రధాన కార్యదర్శి అన్నిశెట్టి జయప్రకాష్ కోరారు.

## కేతకి గోశాలలో కోడెల మృతి

**ఝరాసంగం, అక్టోబరు 1, ప్రభాతవార్త:** మండల కేంద్రమైన ఝరాసంగం లోని శ్రీ కేతకి సంగమేశ్వర ఆలయ గోశాలలో కోడెలు మృత్యువాత పడుతున్నాయి. భక్తులు అందించిన కోడెలు మృత్యువాత పడుతున్నా అధికారులు పట్టించుకోకపోవడంతో భక్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.గోశాలలో ఈ పాటికే అనేక పశువులు మృత్యువాడ పడుతున్నాయని భక్తులు విచారం వ్యక్తం చేస్తున్నారు. గోశాలలోని మూగజీవాలు మృత్యువాత పడకుండా పశువైద్యాధికారులు చర్యలు తీసుకునేలా చర్యలు తీసుకోవాలని భక్తులు సూచిస్తున్నారు.


మృతి చెందిన కోడెల దృశ్యం


పెద్దచింతకుంటలోని ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు

## జలహనుమాన్ ఆలయంలో పూజలు,అన్నదానం

**నర్సాపూర్, అక్టోబర్ 1,ప్రభాతవార్త:** నర్సాపూర్ మెదక్ ప్రధాన రోడ్డులోని పెద్దచింతకుంట గ్రామ శివారులో వెలిసిన జలహనుమాన్ ఆలయంలోశని వారం శ్రీజలాంజనేయస్వామికి ప్రత్యేక పూజలు, అన్నదాన కార్యక్రమాలను ఆలయ కమిటీ చైర్మన్ వడ్ల సుదాకర్‌చారి అధ్వర్యంలో నిర్వహించడం జరిగింది, ఈమేరకు అన్నదానం, పూజా కార్యక్రమాలు అన్నదాతలు నర్సాపూర్ పట్టణానికి చెందిన నాగేశ్‌గుప్త కుటంభ సభ్యుల అధ్వర్యంలో భక్తి శ్రద్దలతోనియమ నిష్టలతో ప్రత్యేక పూజలు జరిగాయి. ఈ పూజా కార్యక్రమాలను ఆయ పూజారి రాధాకృష్ణాశర్మ, శివ,రాజు పంతుళ్ళ అధ్వర్యంలో వేద మంత్రాల మధ్యన జలాంజనేయస్వామికి అబిషేకం, చందన లేపనం, వంటి ప్రత్యేక పూజలు చేశారు.అనంతరం ఆలయ కమిటీ చైర్మన్ వడ్ల సుధాకర్‌చారి హాజరైన భక్తులకు తీర్ధ ప్రసాదాలను వితరణ చేశారు. ఈమేరకు మధ్యాహ్నం అన్నదాతలు నర్సాపూర్ పట్టణానికి చెందిన నా గేశ్‌గుప్త కుటంభ సభ్యులు నిర్వహించిన అన్నదాన కార్యక్రమంలో భక్తులు పాల్గొని అన్నదానాన్ని స్వీకరించారు.ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ వడ్ల సుధాకర్‌చారి,అన్నదాతలు నర్సాపూర్ పట్టణానికి చెందిన నాగేశ్‌గుప్త కుటంభ సభ్య, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

## కళాశాలలో ఉత్సాహంగా ఫ్లాష్‌మాబ్


నృత్యాలు చేస్తున్న విద్యార్థులు

**నర్సాపూర్,, అక్టోబర్ 1,ప్రభాతవార్త:** నర్సాపూర్ సమీపంలోని బివిఆర్ఐటి ఇంజనీరింగ్ కళాశాలలో శుక్రవారం ఫ్లాష్‌మాబ్ ను విధ్యార్ధిని, విద్యార్థులు ఉత్సాహంగా,ఉల్లాసంగా ప్రదర్శించారు. ఈ సందర్బంగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ లక్ష్మి ప్రసాద్ మాట్లాడుతూ అక్టోబర్ 12, 13 తేదీల్లో జరుగబోయే 2022 ప్రామోథీన్ ఈవెంట్ సందర్బంగా ఈ యొక్క ఫ్లాస్‌మాబ్ ను ప్రదర్శించడం జరిగిందని తెలిపారు.ఈ ఫ్లాష్ మాబ్ ను కళాశాల విధ్యార్థి , విధ్యార్థులతో పాటు ప్రిన్సిపాల్ మరియు అధ్యాపక బృందం ఆసక్తిగా తిలకించారు.

## ఇంటర్మీడియెట్ ఎడ్యుకేషన్ కమిషనర్‌కు సన్మానం


జలీల్‌ను సన్మానిస్తున్న కళాశాల ప్రిన్సిపాల్ రవిందర్

**నర్సాపూర్,అక్టోబర్ 1, ప్రభాతవార్త:** ఇంటర్మీడియెట్ ఎడ్యుకేషన్ కమీషనర్ సయ్యద్ ఓమర్ జలీల్ పదవీ విరమణ కార్యక్రమం హైద్రాబా ద్‌లోని ఎగ్జిబిషన్ గ్రౌండ్ లో శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి నర్సాపూర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ రవిం దర్ హాజరై పుష్పగుచ్ఛాన్ని అందజేసి శుభాబివందనాలు తెలియజేశా రు.ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ రవిందర్ మాట్లాడుతూ మూడున్నర సంవ త్సరాలుగా బోర్డ్ ఆఫ్ ఇంటర్మీడియెట్ లో విశిష్ట సేవలు అందించారని అ న్నారు. ముఖ్యంగా విద్యార్థులకు కరోనా మయంలో డిజిటలన తరగ తులను నిర్వామించారని తెలిపారు. అంతేగాక విధ్యార్థుల్లో పరీఓల పట్ల ఆందోళనలు తొలిగించేందుకుగాను సకాలజీఇతర నిపుణులను సలహాలను అందించేల కృసి చేవాడని ఆయన సేవలను కొనియాడారు.

## ధరలకనుగుణంగా కనీసవేతనాలు ఇవ్వాలి

**సిఐటియు జిల్లా అధ్యక్షులు మహేందర్‌రెడ్డి**


జిల్లా మహాసభలో మాట్లాడుతున్న మహేందర్‌రెడ్డి

**నర్సాపూర్, అక్టోబర్ 1, ప్రభాతవార్త:** పెరుగుతున్న ధరలకనుగుణంగా వివిద రంగాల్లో పని చేస్తున్న కార్మికులందరికి కనీస వేతనాలు 21 వేలు ఇవ్వాలని సిఐటియు జిల్లా అధ్యక్షులు మహేందర్‌రెడ్డి అన్నారు.శనివారం నర్సాపూర్ సిఐటియు కార్యాలయంలో మిషన్ భగీరథ యూనియన్ జిల్లా మహసభను నిర్వహించారు. ఈసభలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం నూతన లేబర్ కోర్టులను తీసుకొచ్చి కార్మికుల నడ్డివిరి చిందని ఆవేదన వ్యక్తం చేశారు. అనేక పోరాటాల ఫలితంగా తెచ్చుకున్న కార్మిక చట్టాలను మార్చడం సరైంది కాదన్నారు.రోజురోజుకు నిత్యవసర వస్తు ధరలు ఆకాశానికి వెళ్తుంటే కార్మికుడి జీతం మాత్రం అంతేఉందని మండిపడ్డారు. నేటి పరిస్థితుల్లో కనీసం 21 వేల వేతనం ఉంటేనే కుటుం బాలను పోషించుకొని, ఆరోగ్యంగా ఉండే అవకాశముందన్నారు. ప్రభుత్వం చెప్పిన పద్దతులతో కొత్త ఉద్యోగాలను వెంటనే భహర్తీ చేయాలని డిమాండ్ చేశారు. ఈకార్యక్రమంలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు కదారి నాగ రాజు, కార్మికులు రాజు, నర్సింలు,దుర్గప్ప, బాలు, స్వామి, అశోక్ అక్షణ్, సురేశ్, మాణిక్యం, శివాలాల్ తదితరులు పాల్గొన్నారు.

## జోగిపేటలో ఘణంగా బతుకమ్మ సంబరాలు

**జోగిపేట, అక్టోబర్ 01,ప్రభాతవార్త:** బతుకమ్మ పండగను జోగిపేటలో శనివారంనాడు ఘణంగా జరుపుకున్నారు. సద్దుల బతుకమ్మ పండగను పురస్కరించుకొని జోగిపేట మున్సిపాలిటీ ఆధ్వర్యంలో స్థానిక వ్యవసాయ మార్కెట్ కమిటి ఆవరణలో మహిళలు బతుకమ్మ ఆడేందుకు వీలుగా అవస రమైన లైటింగ్, డిజెను ఏర్పాటు చేయటంతోపాటు మార్కెట్ ఆవరణలో అలంకరణ చేశారు. అంతేకాకుండా పట్టణంలో పలుచోట్ల ఎల్ఇడి లైటింగ్‌తో పలు దేవీ విగ్రహాలను ఏర్పాటు చేశారు. ఈ బతుకమ్మ ఉత్సవాల్లో అందోలు ఎమ్మెల్యే చంటి క్రాంతికిరన్ పాల్గొని మహిళలతో కలిసి పూల బతుకమ్మలను తిలకించారు. ఆయన వెంబడి మున్సిపల్ చైర్మెన్ గూడెం మల్లయ్య, ఎఎంసి మాజీ చైర్మెన్ మన్‌సాన్‌పల్లి మల్లిఖార్జున్, టిఆర్ఎస్ పట్టణ అధ్యక్షులు సార శ్రీధర్, మాజీ కౌన్సిలర్ పులుగు గోపాల్‌రావు తదితరులు పాల్గొన్నారు.


బతుకమ్మలను ఎత్తుకున్న ఎమ్మెల్యే క్రాంతికిరన్, ఆయన సతీమణి


యోగ శిక్షకులు సతీష్‌ను సన్మానిస్తున్న కలెక్టర్

## యోగాతో అనారోగ్యాలు నయం

**జిల్లా కలెక్టర్ ప్రశాంత్ జీవన్ పాటిల్**

**సిద్దిపేట రూరల్, అక్టోబర్ 1, ప్రభాతవార్త :** యోగా వలన సమస్త అనారోగ్యాలు నయమవుతాయని జిల్లా కలెక్టర్ ప్రశాంత్ జీవన్ పాటిల్ అన్నారు. గుజరాత్ రాష్ట్రంలో జరుగనున్న 36వ జాతీయ క్రీడా పోటీలలో భాగంగా యోగా విభాగంలో టెక్నికల్ అఫీసియల్‌గా ఎంపికైన యోగ శిక్షకులు తోట సతీష్‌ను జిల్లా కలెక్టర్ ప్రశాంత్ జీవన్ పాటిల్ శనివారం తన క్యాంపు కార్యాలయంలో శాలువాలతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ అన్ని రంగాల్లో ప్రత్యేకత చాటుకుంటున్న సిద్దిపేట జిల్లాను యోగా రంగంలో జాతీయస్థాయిలో కీర్తిని ఇనుమడింప చేయడానికి కృషి చేయాలన్నారు. ప్రతి ఒక్కరూ నిత్య జీవితంలో యోగాను భాగస్వామ్యం చేసుకోవాలన్నారు. యోగా పోటీలు గుజరాత్‌లోని అహ్మదాబాద్‌లో ఈనెల 6 నుంచి 11వ తేదీ వరకు జరగనున్నాయి. కార్యక్రమంలో ప్రెస్ అకాడమీ సభ్యులు కె.అంజయ్య, యోగాసనా స్పోర్ట్స్ అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు తోట అశోక్, నిమ్మ శ్రీనివాస్‌రెడ్డి, యోగ శిక్షకులు గంగాపురం శ్రీనివాస్, బస్వరాజ్‌కుమార్, వ్యాయామ ఉపాధ్యాయ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కదుర్ల హరికిషన్, ఎజీఎఫ్ జిల్లా కార్యదర్శి బిక్షపతి, వ్యాయామ ఉపాధ్యాయులు రాజ్ మోహన్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్‌ను శాలువా, జ్ఞాపికలతో ఘనంగా సత్కరించారు.

## చిందు కళాకారులకు దళితబంధు అందించాలి

సిద్దిపేట అర్బన్, అక్టోబర్ 1, ప్రభాతవార్త : రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న అన్ని సంక్షేమ పథకాలలో చిందు యక్షగాన కళాకారులకు ప్రాధాన్యత ఇవ్వాలని చిందు కళాకారుల సంఘం జిల్లా అధ్యక్షులు కనకయ్య ప్రభుత్వాన్ని కోరారు. సిద్దిపేట ప్రెస్‌క్లబ్‌లో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో అయన మాట్లాడారు. తెలంగాణ సాంస్కృతిక సారధి ద్వారా ప్రభుత్వం నిర్వహిస్తున్న అవగాహన ప్రదర్శనలలో చిందు కళాకారులకు గుర్తింపు ఇవ్వాలన్నారు. దళితబంధులో తమకు లబ్ది చేకూరేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. చిందు కళాకారుల అత్మగౌరవ భవనానికి సిద్దిపేటలో స్థలం కేటాయించి భవన నిర్మాణానికి సహకరించాలని రాష్ట్ర అర్థిక, అరోగ్య శాఖ మంత్రి తన్నీరు హరీష్‌రావును కోరారు. అనంతనం జిల్లా చిందు కళాకారుల నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. గౌరవాధ్యక్షులుగా పి.వెంకటయ్య (మందపల్లి), జిల్లా అధ్యక్షులుగా పి.కనకయ్య(తుక్కాపూర్), ఉపాధ్యక్షులుగా పి.బాబు(ఎర్రవెల్లి), ప్రధాన కార్యదర్శిగా బాబు. ఎ.దాసు (ఎర్రవెల్లి), కోశాధికారిగా చంద్రమౌళి(వీరారెడ్డిపల్లి), సంయుక్త కార్యదర్శిగా జి.పోశయ్య, జిల్లా కారవర్గ సభ్యులుగా పి.పర్శరాములు, గజలశ్రీలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో చిందు కళాకారులు వెంటయ్య, పిన్నింటి దాసు, చంద్రమౌళి, పోశయ్య తదితరులు పాల్గొన్నారు.

## సిఎం రిలీఫ్ ఫండ్ పేదలకు వరం

**మెదక్ ఎంపి కొత్త ప్రభాకర్‌రెడ్డి**

**మిరుదొడ్డి. అక్టోబర్ 1, ప్రభాతవార్త :** సిఎం రిలీఫ్ ఫండ్ పేదలకు వరం లాంటిదని మెదక్ ఎంపి కొత్త ప్రభాకర్‌రెడ్డి అన్నారు. శనివారం మండల కేంద్రంలోని స్థానిక రామాలయ కళ్యాణమండపంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో లబ్దిదారులకు సిఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ పేద మధ్య తరగతి కుటుంబాలకు మెరుగైన వైద్య చికిత్స నిమిత్తం సిఎం రిలీఫ్ ఫండ్ ఎంతో దోహదం చేస్తుందన్నారు. అనంతరం రామలయం, కొత్త బస్టాండు సమీపంలో ఏర్పాటు చేసిన దుర్గామాత శరన్నవరాత్రోత్సవాలలో భాగంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. దుర్గామాత నిర్వాహణ కమిటీ సభ్యులు శాలువతో ఎంపిని సన్మానించారు. డెంగ్యూ వ్యాధితో మృతి చెందిన కనుగంటి కోటి కుటుంబాన్ని పరామర్శించారు. అంతకు ముందు కొండాపూర్‌లోని వైకుంఠధామం, బతుకమ్మ మెట్ల వద్ద ఎంపి సర్పంచ్ పెద్ది కవితరాజు, టిఅర్ఎస్ నాయకులు గుండం రాజమహేందర్‌రెడ్డితో కలిసి మొక్కలు నాటారు. అయా కార్యక్రమాల్లో సర్పంచ్ రంగమైన రాములు,ఎఎంసి చైర్మన్ వల్లాల సత్యనారాయణ,మండల టిఅర్ఎస్ పార్టీ అధ్యక్షులు తోట అంజిరెడ్డి, సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షులు తుమ్మల బాలరాజు, కో-అప్షన్ సభ్యులు హైమద్, టిఅర్ఎస్ నాయకులు ధర్మారం బాబు, గొట్టం బైరయ్య, గొట్టం రాధాకృష్ణ, సిద్ది భూపతి, ఎలుముల స్వామి, నరేష్, జ్ఞానేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణ సాంప్రదాయాలను కాపాడుకుందాం

**-సిపిఐ జిల్లా కార్యదర్శి మంద పవన్**


బతుకమ్మ వేడుకల్లో పాల్గొన్న మందపవన్

**హుస్నాబాద్,అక్టోబరు01,ప్రభాతవార్త**

తెలంగాణ సాంప్రదాయాలను కాపాడుకునేందుకు ప్రతీ ఒక్కరు కృషి చేయాలని సిపిఐ జిల్లా కార్యదర్శి మంద పవన్ అన్నారు.శనివారం రోజున హుస్నాబాద్ పట్టణంలోని అనభేరి సింగిరెడ్డి అమరుల భవన్‌లో భారత జాతీయ సమాఖ్య (ఎన్ఎఫ్ఐడబ్ల్యూ) సిద్దిపేట జిల్లా సమితి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన బతుకమ్మ సంబరాలకు ముఖ్య అతిధిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా మహిళా సమితి సభ్యులు తీరొక్కపూలతో బతుకమ్మను పేర్చి సాంప్రదాయ పద్దతిలో నృత్యాలు చేశారు.అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో మంద పవన్ మాట్లాడుతూ బతుకమ్మ పండగలో పల్లెలతో పాటు పట్టణాలలో సైతం ప్రజలందరూ ఉత్సాహంతో పాల్గొంటున్నారని,ఈ సాంప్రదాయాన్ని ఇదే సూర్తితో కొనసాగించాలన్నారు.ఈ కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు గడిపె మల్లేష్,అక్కన్నపేట మండల కార్యదర్శి కొమ్ముల భాస్కర్,మహిళా సమాఖ్య జిల్లా అధ్యక్షురాలు పద్మ,వర్కింగ్ ప్రెసిడెంట్ మమత,రజిని,నాయకులు సుజిత్,నాగరాజు,చారీ, అయిలయ్య, స్వాతి, శోభ, రుచిత, వనిత,రేవతి,నిర్మల పాల్గొన్నారు.

## మంజులరెడ్డికి ఘన సన్మానం

**హుస్నాబాద్,అక్టోబరు01,ప్రభాతవార్త**

హుస్నాబాద్ పట్టణంలోని గాంధీ చౌరస్తా యూత్,కాలనీ వాసులు ఏర్పాటు చేసిన దుర్గామాత మండపాన్ని శనివారం రోజున సామాజిక సేవకురాలు కర్ణకంటి మంజులరెడ్డి సందర్శించారు.ఈ సందర్భంగా మండపానికి వచ్చిన మంజులరెడ్డికి మండప నిర్వాహకులు స్వాగతం పలికి శాలువాతో సత్కరించారు.అనంతరం ఏర్పాటు చేసిన కుంకుమ పూజలో పాల్గొన్న మంజులరెడ్డి పూజలో పాల్గొన్న 108 మంది మహిళలకు చీరలు పంపిణీ చేశారు.అనంతరం మండపం వద్ద ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు.ఈ కార్యక్రమంలో గాంధీనగర్ యువతతో పాటు కాలనీ మహిళలు,మంజులక్క యువసేన నాయకులు పాల్గొన్నారు.


సత్కరిస్తున్న గాంధీనగర్ వాసులు

# మత్స్యకారుల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

**-ఎమ్మెల్సీ యాదవరెడ్డి, ఎఫ్‌డిసి చైర్మన్ ప్రతాప్‌రెడ్డి**

**గజ్వేల్, అక్టోబర్ 1 (ప్రభాతవార్త):** మత్స్యకారుల సంక్షేమం కోసం ప్రభుత్వం పనిచేస్తుందని ఉమ్మడి మెదక్ జిల్లా ఎమ్మెల్సీ డాక్టర్ యాదవరెడ్డి, ఎఫ్‌డిసి చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డిలు పేర్కొన్నారు. శనివారం గజ్వేల్ మున్సిపల్ పరిధి ప్రజ్ఞాపూర్ ఊరచెరువులో 36వేల చేపపిల్లలను వదిలారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశంలో ఎక్కడా లేనివిధంగా తెలంగాణ రాష్ట్రంలోనే మత్స్యకారుల జీవితాల్లో వెలుగులు నింపడానికి ఆర్థికంగా బలోపేతం చేయడానికి చేపపిల్లల పంపిణీ చేపట్టినట్లు తెలిపారు. మత్స్య కార్మికులు గతంలో ఎన్నో కష్టాలు అనుభవించేవారని, ప్రస్తుతం తెలంగాణ ప్రభుత్వ హయాంలో మత్స్యకారుల కష్టాలు తీరాయన్నారు. రాష్ట్ర ప్రభుత్వం బడుగు, బలహీన వర్గాలకు పెద్దపీట వేస్తుందన్నారు. గొల్లకురుమలను ఆర్థికంగా బలోపేతం చేసేందుకు గొర్రెలను పంపిణీ చేసినట్లు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతి సంవత్సరం వంద కోట్లు 70 శాతం సబ్సిడీతో చేపల పెంపకానికి అన్ని రకాల సహాయసహకారాలు అందిస్తుందన్నారు. ఇప్పటి వరకు 500 కోట్ల రూపాయలను తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఖర్చుపెట్టిందన్నారు. కేంద్రంలోని నరేంద్రమోడి సర్కార్ రైతుల బావుల వద్ద మోటార్లకు మీటర్లు వేసి తెలంగాణ రైతాంగం యొక్క నడ్డి విరిచే ప్రయత్నం చేసిందన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ మాదాసు శ్రీనివాస్, వైస్ చైర్మన్ జకియొద్దీన్, టిఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు నవాజ్‌మీరా, స్థానిక కౌన్సిలర్ మర్కంటి వరలక్ష్మికనకయ్య, తలకొక్కుల భాగ్యలక్ష్మిదుర్గాప్రసాద్, పట్టణ యూత్ అధ్యక్షుడు గడియారం స్వామిచారి, నాచారం ఆలయ మాజీ చైర్మన్ కొట్టాల యాదగిరి, నాచారం దేవస్థానం డైరెక్టర్ మామిడి నరేష్‌గౌడ్, నర్సింలు, బొగ్గుల సురేష్, అహ్మద్, సాయి, ముదిరాజ్ సంఘం అధ్యక్షుడు రొట్టెల శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి ఎల్లేశం, మల్లేశం, దేవేందర్, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.


ఊరచెరువులో చేప పిల్లలు వదులుతున్న ఎమ్మెల్సీ, ఎఫ్‌డిసి చైర్మన్‌లు

**మల్లన్నసాగర్‌లో చేపలను మేమే పట్టుకుంటాం**

ప్రభుత్వం నూతనంగా నిర్మాణం చేసిన మల్లన్నసాగర్ ప్రాజెక్టులో చేపలను మేమే పట్టుకుంటామని శనివారం ప్రజ్ఞాపూర్‌లోని ఊరచెరువు వద్ద ముంపు గ్రామాల ముదిరాజ్ సంఘం నాయకులు ఎమ్మెల్సీ యాదవరెడ్డి, ఎఫ్‌డిసి చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డిలకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గతంలో ప్రాజెక్టు నిర్మాణం చేపట్టకముందు తమ ఊర్లలో ఉన్న చెరువులకు ముదిరాజ్ కులస్తులే హక్కుదారులుగా ఉన్నామని, తమ గ్రామాలు, చెరువులు పూర్తిగా ప్రాజెక్టులో పోవడంతో తాము ఉపాధి కోల్పోయామని, ప్రస్తుతం ప్రాజెక్టులో వేస్తున్న చేపలను తామే పట్టుకొని ఉపాధి పొందుతామని పేర్కొన్నారు. మల్లన్నసాగర్‌లో చేపలు పట్టుకోవడానికి ప్రభుత్వం అనుమతి ఇవ్వాలని ఈ సందర్భంగా కోరారు. ఈ కార్యక్రమంలో మల్లన్నసాగర్ భూ నిర్వాసిత గ్రామాల మత్స్యకార సభ్యులు అశోక్, గణేష్, కనకరాజు, మల్లేశం, కనకయ్య, రాజు తదితరులు పాల్గొన్నారు.

# దుబ్బాకను అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తున్నాం : ఎంపి

**ఎంపి, జిల్లా టిఆర్ఎస్ అధ్యక్షులు కొత్త ప్రభాకర్‌రెడ్డి**

**తొగుట, అక్టోబర్ 1, ప్రభాతవార్త :** అబద్దాలు చెప్పి ఎమ్మెల్యేగా ఎన్నికైన బిజెపి నాయకుని అసలు రంగు ఏడాదిన్నరలో ప్రజలు గ్రహించారని మెదక్ ఎంపి, జిల్లా టిఅర్ఎస్ అధ్యక్షులు కొత్త ప్రభాకర్‌రెడ్డి అన్నారు. మండలంలోని వర్దరాజ్‌పల్లిలో జరిగిన కార్యక్రమంలో శనివారం మండల కేంద్రమైన తొగుటకు చెందిన మండల కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి రేపాక విష్ణు, మండల బీసీ సెల్ ఉపాధ్యక్షులు గోరిమెల్ల గణేష్, మాల మహానాడు నాయకులు అనుమెల్ల అబ్బి, కాసర్ల యాదగిరి, గ్రామా బీసీ సెల్ ఉపాధ్యక్షులు బండారు అశోక్, బీసీ సెల్ కార్యదర్శి బండారు స్వామి, సీతమధు, బండారు మల్లేశం, చింత అజయ్,వర్దరాజ్‌పల్లికి చెందిన బిజెపి నాయకులు జయరాంరెడ్డి, మండల కమలాకర్,ఉప్పరి కనకరాజు, నర్సింలు తదితరులు ఎంపి సమక్షంలో అయా పార్టీలకు రాజీనామాలు చేసి టిఅర్ఎస్ తీర్థంపుచ్చుకున్నారు. పార్టీలో చేరిన వారికి గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి అహ్వానించారు. అనంతరం అయన మాట్లాడుతూ పార్టీలో చేరిన వారికి తప్పకుండా గుర్తింపు లభిస్తుందన్నారు. కొత్త, పాత అనే తేడా లేకుండా ప్రతి ఒక్కరూ పార్టీని మరింత బలోపేతం చేయడానికి కలిసి కట్టుగా ముందుకు సాగాలన్నారు. ఎన్నికలో మాయ మాటలు చెప్పి గెలిచిన ఎమ్మెల్యేపై నియోజకవర్గంలోని అన్ని వర్గాల ప్రజలు అసంతృప్తితో ఉన్నారని తెలిపారు. గ్రామ గ్రామాన టిఅర్ఎస్‌లో చేరడానికి ప్రతిపక్ష పార్టీల నాయకులు, కార్యకర్తలు ముందుకు వస్తున్నారని తెలిపారు. అనంతరం రూ. 5 లక్షలతో నిర్మించ తలపెట్టిన ముదిరాజ్ సంఘం, రెడ్డి సంఘం భవనాల నిర్మాణంకు శంకుస్థాపన చేశారు. సిఎం కెసిఅర్, మంత్రి హరీష్‌రావు సహకారంతో దుబ్బాక నియోజకవర్గాన్ని అన్ని రంగాలలో అభివృద్ధి చేయడం జరుగుతుందన్నారు. అనంతరం గోవర్ధనగిరిలో మార్కెట్ కమిటీ డైరెక్టర్ దుబ్బాక కనకయ్యను ఎంపి సన్మానించారు. గ్రామానికి చెందిన చందుకు సీఎం రిలీఫ్ ఫండ్ కింద మంజూరైన రూ.60 వేల చెక్కును అందించారు. వర్దరాజ్‌పల్లికి చెందిన జయరాంరెడ్డికి రూ. 36 వేల సిఎం రిలీఫ్ ఫండ్ చెక్కును అందించారు. గుడికందుల రెడ్డి సంఘం నాయకులతో మాట్లాడారు. పెద్దమాసాన్‌పల్లి వడ్డెర సంఘం భవన నిర్మాణం కోసం నిధులు మంజూరు చేస్తానని హామీ ఇచ్చారు. ఘనపూర్‌లోని 2వ టిఎంసి భూమి బాధితులతో ఎంపి మాట్లాడి పరిహారం అందేలా చూస్తానని హామీ ఇచ్చారు. తెలంగాణ సచివాలయంకు డాక్టర్ బి.అర్.అంబేద్కర్ పేరు పెట్టినందుకు తెలంగాణ మాల మహానాడు అధ్యక్షులు బొమ్మద కర్ణాకర్ కృతజ్ఞతతో ఎంపికి చిత్ర పటం అందించారు. కార్యక్రమాలలో మండల టిఅర్ఎస్ పార్టీ అధ్యక్షులు జీడిపల్లి రాంరెడ్డి, డిసీసీబి డైరెక్టర్ బక్కి వెంకటయ్య, సర్పంచ్‌లు, ఎంపిటిసిలు, పార్టీ శ్రేణులు తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న ఎంపి ప్రభాకర్‌రెడ్డి

## సిద్దిపేటలో అయుత ఛండీ అతి రుద్ర యాగం

**ఈనెల 6న కార్యక్రమ భూమి పూజ**

**సిద్దిపేట రూరల్, అక్టోబర్ 1, ప్రభాతవార్త :** సిద్దిపేటలో అయుత ఛండీ అతిరుద్ర యాగం నవంబరు 19 నుంచి డిసెంబర్ 2 వరకు నిర్వహించడం జరుగుతుందని శ్రీ కృష్ణ జ్యోతి స్వరూపానంద స్వామి తెలిపారు. శనివారం సిద్దిపేట జిల్లా కేంద్రంలోని వేములవాడ కమాన్ వద్ద యాగశాల ప్రాంగణం వద్ద ఏర్పాటు చేసిన విలేకరులతో అయన మాట్లాడారు. 6వ తేదీన శ్రీ కృష్ణ కాలచక్రం అయుధ చండీ అతిరుద్రం కార్యక్రమానికి భూమి పూజ చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమానికి రాష్ట్ర అర్థిక, అరోగ్యశాఖ మంత్రి తన్నీరు హరీష్‌రావు హాజరువుతున్నట్లు తెలిపారు. యాగానికి 800 మంది వేద పండితులు కార్యక్రమంలో పాల్గొంటారని తెలిపారు. ఈ యాగానికి 36 వేల కేజీల నెయ్యితో, ఒక వెయ్యి లీటర్ల అవు పాలతో లక్ష తమలపాకులతో అర్చన, కోటి కుంకుమార్చన, కోటి దీపోత్సవం నిర్వహించడం జరుగుతుందన్నారు. నవంబరు 19 నుంచి నిర్వహించే అయుధ చండీ అతిరుద్ర మహాయగని కులమతాలకు అతీతంగా భక్తులందరూ అధిక సంఖ్యలో పాల్గొని ఈ మహా యాగాన్ని విజయవంతం చేయాలన్నారు. సమావేశంలో యాగ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## పారిశుద్ధ కార్మికులు, వృద్ధులకు నూతన బట్టల పంపిణీ



పారిశుద్ధ్య కార్మికులు, వృద్దులకు బట్టలు పంపిణీ చేస్తున్న సర్పంచ్

**కొండపాక, అక్టోబర్ 1, ప్రభాతవార్త :** బతుకమ్మ, దసరా పండుగల సందర్భంగా పారిశుద్ధ్య కార్మికులు, వృద్దులకు సర్పంచ్ పోల్కంపల్లి జయంతినరేందర్ అధ్వర్యంలో కొత్త బట్టలను పంపిణీ చేశారు. శనివారం కుకునూర్‌పల్లి గ్రామ పంచాయతీలో పారిశుద్ధ్య కార్మికులకు గ్రామంలోని కొంత మంది వృద్దులకు బట్టలు పంపిణీ చేసి మాట్లాడారు. బతుకమ్మ, దసరా పండుగ సందర్భంగా కార్మికులు, నిరుపేద వృద్దులు సంతోషంగా పండుగ జరుపుకోవాలన్న ఉద్దేశ్యంతో నూతన బట్టలు పంపిణీ చేయడం జరిగిందన్నారు. కార్యక్రమంలో పారిశుద్ధ్య కార్మికులు రాజు, గ్రామ పంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా కుంకుమార్చన

మండల పరిధిలోని కుకునూర్‌పల్లి ఛత్రపతి శివాజీ యూత్ అధ్వర్యంలో దేవి శరన్నవరాత్రోత్సవాలు ఘనంగా సాగుతున్నాయి. శనివారం శరన్నవరాత్రోత్సవాలలో భాగంగా మహిళలు పెద్ద సంఖ్యలో తరలివచ్చి అమ్మవారికి కుంకుమార్చన ఘనంగా నిర్వహించి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. యాదగిరిగౌడ్, ఎల్లవ్వ కుమారులు పర్శరాములు, వర్షిని సహకారంతో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో శివాజీ యూత్ సభ్యులు పాల భాను ప్రసాద్, పాల చరణ్, పాల భాను, రోహిత్, పాల వేణు, ప్రశాంత్, ఉప్పల రవి శంకర్, రాజేష్‌గౌడ్, శ్రీకాంత్, పాల స్వామి, ఉప్పల రాజు, మహేష్, మధుగౌడ్, కృష్ణ, శ్రీకాంత్, సంతోష్, దబ్బెట సాయి అకాశ్, దినేష్, రాజుకుమార్ తదితరులు పాల్గొన్నారు.

## టిపిసిసి మెంబర్‌కు సన్మానం

**హుస్నాబాద్,అక్టోబరు01,ప్రభాతవార్త**

హుస్నాబాద్ పట్టణానికి చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు,హుస్నాబాద్ మాజీ సర్పంచ్ కేడం లింగమూర్తి ఇటీవల టిపిసిసి మెంబర్‌గా ఎన్నికైన సందర్భంగా శనివారం రోజున ఆయనను గిరిజన నాయకుడు గుగులోతు రాజునాయక్ మర్యాద పూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించారు.


లింగమూర్తిని సన్మానిస్తున్న రాజునాయక్


చెరువుకట్టపై ఏర్పాటు చేసిన విద్యుత్ దీపాలను ప్రారంభిస్తున్న సర్పంచ్ శ్రీనివాస్ తదితరులు

## మోతే చెరువుకట్టపై వెలుగులు

**మిరుదొడ్డి, అక్టోబర్ 1, ప్రభాతవార్త:** మండలంలోని మోతే చెరువు కట్టపై నూతనంగా అమర్చిన ఎల్ఈడీ బల్బులను శుక్రవారం రాత్రి సర్పంచ్ కాలేరు శ్రీనివాస్ ప్రారంభించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడతూ ఎంపి కొత్త ప్రభాకర్‌రెడ్డి, సహకారంతో 20 విద్యుత్ స్తంబాలు హైమాస్ దీపాలు కోసం ఎమ్మెల్సీ ఫారూఖ్‌హుస్సేన్ రూ.6 లక్షల నిధులు అందించారని తెలిపారు. ఎంపి, ఎమ్మెల్సీ సహకారంతో బతుకమ్మ పండుగ సందర్భంగా పెద్ద చెరువు కట్టపై వెలుగులు విరజిమున్నాయన్నారు.కార్యక్రమంలో టిఅర్ఎస్‌వి ఎస్సీ సెల్ మండల అధ్యక్షులు బోరం రాజేశ్వర్, మాజీ ఎంపిపి బోరం యాదయ్య, టిఅర్ఎస్ నాయకులు జి.శ్రీనివాస్ పాల్గొన్నారు.

**అదర్శ యూత్ అధ్వర్యంలో అన్నదానం**

మోతే గ్రామంలోని అదర్శ యూత్ అధ్వర్యంలో ఏర్పాటు చేసిన దుర్గాదేవి శరన్నవరాత్రోత్సవాలలో భాగంగా శనివారం గ్రామ రైతు సమన్వయ సమితి కో-అర్డినేటర్ సిద్దమైన చంద్రం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. అన్నదాన కార్యక్రమంలో సర్పంచ్ కాలేరు శ్రీనివాస్, టిఅర్ఎస్ నాయకులు బోరం రాజేశ్వర్, మాజీ ఎంపిపి బోరం యాదయ్య, సంతోష్, రఘుపతిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## రైతులకు అండగా తెరాస ప్రభుత్వం

**-డిసిసిబి డైరెక్టర్ బట్టు అంజిరెడ్డి**


లబ్ధిదారుకు రైతుబంధు చెక్కు అందజేస్తున్న దృశ్యం

**ములుగు, అక్టోబర్ 1 (ప్రభాతవార్త):** దేశంలో ఎక్కడా లేనివిధంగా రైతుల సంక్షేమానికి తెరాస ప్రభుత్వం ఎంతగానో కృషి చేస్తుందని డిసిసిబి డైరెక్టర్ బట్టు అంజిరెడ్డి, ఏఎంసి చైర్మన్ జహంగీర్‌లు అన్నారు. ములుగు మండల పరిధిలోని నర్సాపూర్ గ్రామానికి చెందిన రైతు కాల్వకింది అంజమ్మ అనారోగ్యంతో మృతిచెందగా ప్రభుత్వం పేద రైతుల కోసం అందిస్తున్న రైతుబీమా లబ్ది కోసం అంజమ్మ కుటుంబసభ్యులు ప్రభుత్వానికి దరఖాస్తు చేసుకున్నారు. దీంతో వారికి రైతుబీమా పథకం ద్వారా రూ.5 లక్షలు మంజూరు కాగా ఈ చెక్కును శనివారం ములుగులో డిసిసిబి డైరెక్టర్ బట్టు అంజిరెడ్డి, ఏఎంసి చైర్మన్ జహంగీర్, తెరాస సీనియర్ నాయకులు అంజన్‌గౌడ్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ ఏనుగు బాపురెడ్డి, రాజేందర్‌రెడ్డిలు ఆమె కుటుంబసభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పేదల సంక్షేమానికి ప్రభుత్వం రైతుబీమా, రైతుబంధు, కళ్యాణలక్ష్మి వంటి ఎన్నో సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టి పేద కుటుంబాలకు ఆసరాగా నిలుస్తుందని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో తెరాస మండల యువత విభాగం ఉపాధ్యక్షుడు గోపాల్‌రెడ్డి, ఏఈఓ నివేధిత తదితరులు పాల్గొన్నారు.


అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న పిఎసిఎస్ చైర్మెన్ బాదె చంద్రం

## ప్రపంచవ్యాప్తంగా బతుకమ్మ పండుగకు గుర్తింపు

**పిఎసిఎస్ చైర్మెన్ బాదె చంద్రం**

**రామాయంపేట, అక్టోబర్ 1, ప్రభాతవార్త :** ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం సిద్దించాక, టిఆర్ఎస్ పార్టీ అధికారంలోకి వచ్చి కేసీఆర్ ముఖ్యమంత్రి కాగానే బతుకమ్మ పండుగకు ప్రపంచ వ్యాప్తంగా గుర్తింపును తీసుకువచ్చారని రామాయంపేట పిఎసిఎస్ చైర్మెన్ బాదె చంద్రం అన్నారు. గురువారం నాడు రాత్రి రామాయంపేట పట్టణంలోని సుభాష్ విగ్రహం వద్ద బజరంగ్ యువసేన ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన దేవి నవరాత్రులలో బాగంగా స్వర్గీయ బాదె లక్ష్మి-బాదె నర్సింలు జ్ఞాపకార్థం వారి కుటుంబ సభ్యులు ఏర్పాటుచేసిన అన్నదాన కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా బాదె చంద్రం మాట్లాడుతూ ఉమ్మడి రాష్ట్రంలో గత పాలకుల నిర్లక్ష్యం కారణంగా బతుకమ్మ పండుగకు ఎలాంటి గుర్తింపు ఇవ్వలేదన్నారు. అదే టీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ముఖ్యమంత్రి కేసీఆర్ బతుకమ్మ పండుగ అధికారికంగా ప్రకటించారని ఆయన గుర్తుచేశారు. ఈరోజు తెలంగాణ రాష్ట్రంలోని అన్ని పల్లెల్లో కూడా బతుకమ్మ ఉత్సవాలు చాలా ఘనంగా జరుగుతున్నాయని తెలిపారు.మున్సిపల్ కౌన్సిలర్‌లు చిలుక గంగాధర్, నాయకులు చింతల యాదగిరి, సొసైటీ డైరెక్టర్‌లు పోచమ్మల ఐలయ్య, దేవుని నర్సింలు, సీఈవో పుట్టి నర్సింలు (గజ్జెల్), పార్టీ నాయకులు నాగేశ్వ ర్‌రెడ్డి, శ్యామ్, బాదె రామరాజు, బాదె మల్లేశం పాల్గొన్నారు.

**నవదుర్గా ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో...**

శ్రీదేవి శరన్నవరాత్రోత్సవాలలో భాగంగా పట్టణంలోని దేవి మండపాల వద్ద నిత్యం పూజలు ఘనంగా నిర్వహిస్తున్నారు. అంతే కాకుండా నిత్యం ఒక కార్యక్రమం నిర్వహిస్తూ సందడి చేస్తున్నారు. పట్టణంలోని రాజేంద్రనగర్‌లో నవదుర్గా ఉత్సవకమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అమ్మవారి మండపం వద్ద పెద్ద ఎత్తున కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. శనివారం నాడు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసిన అనంతరం అన్న దాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని స్థానిక ఎస్ఐ రాజేష్ ప్రారంభించి కార్యక్రమంలో పాల్గొని స్వయంగా ప్రజలకు బోజనం వడ్డించారు. కార్యక్రమంలో నవదుర్గా ఉత్సవ కమిటీ వారు పాల్గొన్నారు.

## కేసీఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకం


పాలాభిషేకం చేస్తున్న గిరిజన నాయకులు

**హుస్నాబాద్, అక్టోబరు01,ప్రభాతవార్త** రాష్ట్రంలో గిరిజనుల రిజర్వేషన్ పెంచుతూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయడం పట్ల శనివారం రోజున హుస్నాబాద్ పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తాలో గిరిజన సంఘాల నాయకులు, ప్రజాప్రతినిధులు హర్షం వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా తమకు రిజర్వేషన్ పెంచిన రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించారు. అనంతరం మిఠాయిలు పంపిణీ చేసి,టపాసులు కాల్చి సంబరాలు జరుపుకున్నారు.ఈ సందర్భంగా హుస్నాబాద్ ఎంపిపి లకావత్ మానససుభాష్ మాట్లాడుతూ దాదాపు 36 ఏండ్లుగా రిజర్వేషన్ పెంపు కోసం అనేక ఉద్యమాలు చేసినా ఏప్రభుత్వం పట్టించుకోలేదని,గిరిజనుల చిరకాల వాంచ అయిన 10శాతం రిజర్వేషన్‌ను ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రకటించడం సంతోషకరమైన విషయమన్నారు.తెలంగాణలో ముఖ్యమంత్రి కేసీఆర్ గిరిజనులకు పెద్ద పీట వేస్తున్నారని గుర్తు చేశారు.అధికారంలోకి వచ్చిన కొద్ది రోజులకే తండాలను గ్రామ పంచాయతీలుగా మార్చి తండాల అభివృద్ది చేయడంతో పాటు రిజర్వేషన్ కూడా పెంచి కేసీఆర్ గిరిజనులకు దేవుడయ్యారన్నారు.గిరిజనుల రిజర్వేషన్‌కు కృషి చేసిన మంత్రి సత్యవతి రాథోడ్‌కు వారు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.గిరిజనుల రిజర్వేషన్‌ను పెంచాలని 2017లో కేసీఆర్ ప్రభుత్వం అసెంబ్లీలో తీర్మాణం చేసి పంపితే కేంద్ర ప్రభుత్వం తమకు ఎలాంటి బిల్లులు రాలేదని నిర్లక్ష్యంగా వ్యవహరించారన్నారు. ఈ విషయంపై కరీంనగర్ ఎంపి,బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ ఒక్కసారి కూడా మాట్లాడకపోవడం బాధాకరమైన విషయమన్నారు. ఈ కార్యక్రమంలో అక్కన్నపేట ఎంపిపి మాలోతు లక్ష్మిభీలునాయక్, జడ్పిటిసి భూక్య మంగశ్రీనివాస్,జిల్లలగడ్డ సర్పంచ్ స్వరూపలింగానాయక్,గిరిజన నాయకులు తిరుపతినాయక్,రమేష్‌నాయక్,మోతిరాం,లక్ష్మన్ నాయక్,గుగులోతు తిరుపతినాయక్‌తో పాటు తదితరులు పాల్గొన్నారు.

## దుర్గామాతను దర్శించుకున్న ఎన్‌సి.సంతోష్

**గజ్వేల్, అక్టోబర్ 1 (ప్రభాతవార్త):**

గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపల్ పరిధిలోని ప్రజ్ఞాపూర్‌లో రామాలయం వద్ద ఏర్పాటుచేసిన దుర్గామాతను శనివారం ఐవిఎఫ్ జిల్లా యువజన విభాగం అధ్యక్షుడు ఎన్‌సి.సంతోష్ దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దుర్గాదేవిని పూజించడం వల్ల సకల అష్టైశ్వర్యాలు కలగడంతో పాటు రాష్ట్రం సుభిక్షంగా ఉంటుందన్నారు. దుర్గాదేవి దయ వల్ల మరోసారి సిఎం కెసిఆర్ అధికారంలోకి రావాలని ఆకాంక్షించారు. ఆయన వెంట నాచారం ఆలయ డైరెక్టర్ మామిడి నరేష్‌గౌడ్, గజ్వేల్ మండల యాదవ సంఘం అధ్యక్షుడు కన్నాయాదవ్, దుర్గామాత మండప నిర్వాహకులు వద్దేపల్లి ప్రసాద్, లింగంయాదవ్, కైలాసం, మధు, రాము, మర్రి స్వామి, నాగరాజు, ప్రసాద్ తదితరులు ఉన్నారు.

## బతుకమ్మ వేడుకల ఏర్పాట్ల పర్యవేక్షణ

**రామచంద్రాపురం కార్పొరేటర్ పుష్పనగేష్**

**రామచంద్రాపురం, అక్టోబర్ 1, ప్రభాతవార్త:** నేడు ఆదివారం జరగనున్న బతుకమ్మ పండుగ సందర్భంగా రామచంద్రాపురం కార్పొరేటర్ బూరుగడ్డ పుష్పనగేష్ శనివారం శ్రీనివాస్ నగర్ కాలనీ, సండే మార్కెట్‌లో బతుకమ్మ వేడుకలు జరగనున్న ప్రదేశంలో జీహెచ్ఎంసీ డిప్యూటీ కమిషనర్ బాలయ్య, ఇంజనీరింగ్ డీఈపీర్‌సింగ్, ఏఈ ప్రభు, డీఈ సునీల్, ఏఈ రామ్మోహన్, విద్యుత్ ఏఈ సంజీవరావు, శానిటేషన్ సూపర్ వైజర్ వెంకటేశ్వర్లు, ఎంతమోలోజీ సూపర్ వైజర్ ఇజాజ్, మల్లికార్జున్, సీఐ సంజయ్ కుమార్, సంబంధిత అధికారులతో కలిసి ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ ఎన్నడూ లేని విధంగా రామచంద్రాపురం డివిజన్‌లో పెద్ద ఎత్తున బతుకమ్మ వేడుకలు జరుగుతున్నాయని అన్నారు. లైటింగ్, జనరేటర్, కరెంటు, పరిశుభ్రత, స్టేజీ, మొబైల్ టాయిలెట్స్, దోమల మందు, పోలీస్ ఫోర్స్ ఎక్కువగా ఏర్పాటు చేయ్యాలని, ఎక్కడ ఎలాంటి సమస్యలు తలెత్తకుండా యుద్ధప్రాతిపధంగా పనులు చేపట్టాలని అధికారులు ఆదేశించారు. అలాగే ఓల్డ్ రామచంద్రాపురంలో ఉన్న బతుకమ్మ వదిలే కోనేరు వద్ద పర్యటించి నీరు తక్కువ కాకుండా చూసుకోని, లైటింగ్, జనరేటర్, పోలీస్ ఫోర్స్, కరెంటు, శానిటేషన్ చూసుకోవాలని కార్పొరేటర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు మల్లేష్, బేగరి శంకర్, నర్సింహా, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.


అధికారులతో మాట్లాడుతున్న కార్పొరేటర్ పుష్పనగేష్



సిఎం కేసిఆర్ చిత్ర పటానికి పాలాభిషేకం చేస్తున్న గిరిజనులు

## కేసిఆర్ చిత్ర పటానికి పాలాభిషేకం

**చౌటకూరు, అక్టోబరు 1, ప్రభాతవార్త:** గిరిజన రిజర్వేషన్‌ల జీఓను విడుదల చేయడం పట్ల జిల్లా గిరిజన సంక్షేమ సంఘం ఉమ్మడి మెదక్ జిల్లా అధ్యక్షులు జైపాల్ నాయక్ ఆధ్వర్యంలో మండలంలోని బొమ్మిరెడ్డిగూడెంలో ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు చిత్ర పటానికి శనివారం పాలాభిషేకం చేసి గిరిజనులు తమ నోళ్లను తీపి చేసుకున్నారు. ఈసందర్భంగా జైపాల్ నాయక్ మాట్లాడుతూ గిరిజనుల చిరకాల వాంచ నెరవేర్చిన ఘటన కేసిఆర్‌కే దక్కిందన్నారు. విద్యా, ఉద్యోగ రంగాల్లో రిజర్వేషన్‌లతో గిరిజనులు లబ్ధిపొందుతారన్నారు. 6 శాతం నుంచి 10శాతంకు రిజర్వేషన్ కల్పిస్తూ 33 జీఓను జారీ చేసిన సిఎంకు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో గిరిజన నాయకులు రవీందర్‌నాయక్, ప్రేమలాల్, అకేష్, శివాజీ, రాకేష్, మీట్య, పుణ్య సంతోష్, బద్య, నవీన్, అఖిల్, జస్వంత్, శివ, ప్రశాంత్, మూడ్ పవన్, సజ్జత్, జాదవ్ తదితరులు పాల్గొన్నారు. ఇదిలా ఉండగా గిరిజనుల రిజర్వేషన్‌ల పెంపు జీఓను జారీ చేసినందున ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావుకు, మంత్రి సత్యవతి రాథోడ్‌కు అందోల్ నియోజకవర్గ గిరిజన విద్యార్థి సంఘం అధ్యక్షులు, టిఎస్‌ఆర్‌వి జిల్లా నాయకులు దినేష్ నాయక్ కృతజ్ఞతలు తెలిపారు.

## సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలి

**-మండల సభలో అధికారులకు జడ్పీటిసి సూచన**



సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న స్వప్న

**న్యాల్‌కల్, అక్టోబరు 1, ప్రభాతవార్త:** మండలంలోని ఆయా గ్రామాల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించేందుకు అధికారులు తగు చర్యలు తీసుకోవాలని జడ్పీటిసి సభ్యులు బోడ స్వప్న సూచించారు. శనివారం ఎంపిపి అధ్యక్షురాలు అంజమ్మ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. సమావేశాలకు అధికారులు హాజరుకాకుంటే సమస్యలు ఎలా పరిష్కారం అవుతాయని స్వప్న ఆవేదన వ్యక్తం చేశారు. పలు గ్రామాల్లో అధికారుల నిర్లక్ష్యం మూలంగా అభివృద్ధి పనులు ముందుకు సాగడం లేదని విచారం వ్యక్తం చేశారు. అధికారులు, ప్రజా ప్రతినిధులు సమన్వయంతో పనులు చేస్తేనే మండలం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందే అవకాశం ఉంటుందని గుర్తు చేశారు. కార్యక్రమంలో ఎంపిపి ఉపాధ్యక్షులు గౌసోద్దిన్, ఎంపిడిఓ సుమతి, తహసీల్దార్ ఆంటోని, ఆయా గ్రామాల ఎంపిటిసి, సర్పంచులు, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

## కల్లుగీత కార్మిక మండల కార్యవర్గం

**కంది, అక్టోబరు 1, ప్రభాతవార్త:** మండల కల్లుగీత సంఘం కార్యవర్గాన్ని జిల్లా కేంద్రమైన సంగారెడ్డిలోని అంబేద్కర్ భవన్‌లో శనివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సంఘం జిల్లా అధ్యక్షులు ఆశన్న గౌడ్, ఉపాధ్యక్షులు జంగన్న గౌడ్, జిల్లా ప్రధాన కార్యదర్శి రమేష్ గౌడ్‌ల సమక్షంలో నూతన మండల కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. సంఘం మండల గౌరవ అధ్యక్షులుగా టంకేష్ గౌడ్, అధ్యక్షులుగా లక్ష్మన్ గౌడ్ (చిద్రుప్ప), అధ్యక్షులుగా లక్ష్మన్‌గౌడ్ (చర్లగూడెం), కార్యదర్శిగా శ్రీధర్‌గౌడ్ (కంది), ఉపాధ్యక్షులుగా మల్లేశం గౌడ్ (చేర్యాల), కోశాధికారిగా వీరేశం గౌడ్, కమిటి సభ్యులుగా అంజన్న గౌడ్, నరసింహాగౌడ్, శేఖర్‌గౌడ్, సత్యనారాయణగౌడ్, రాములు గౌడ్, వెంకటేశం గౌడ్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

## పోలీసు కార్యాలయంలో బతుకమ్మ సంబరాలు



పోలీసు కార్యాలయం వద్ద బతుకమ్మ సంబరాల దృశ్యం

**సంగారెడ్డి టౌన్, అక్టోబరు 1, ప్రభాతవార్త:** జిల్లా కేంద్రమైన సంగారెడ్డిలోని పోలీసు కార్యాలయ ఆవరణలో శనివారం బతుకమ్మ సంబరాలు జరుపుకున్నారు. తీరుతీరు పూలతో అందంగా అలంకరించిన బతుకమ్మలు చుట్టూ పాటలు పాడుతూ ప్రదక్షిణలు చేశారు. కార్యక్రమంలో డిఎస్‌పి రవీంద్రారెడ్డి, పోలీసు అధికారులు రమేష్, మహేష్ గౌడ్, కృష్ణ, డానియల్, యాదవరెడ్డి, నాగరాజు పాల్గొన్నారు.

## మండల పరిషత్‌లో బతుకమ్మ సంబరాలు



మండల పరిషత్‌లో బతుకమ్మ సంబరాలు చేసుకుంటున్న మహిళలు

**కంది, అక్టోబరు 1, ప్రభాతవార్త:** మండల కేంద్రమైన కంది లోని మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో భనివారం బతుకమ్మ సంబరాలు చేసుకున్నారు. ఎంపిపి అధ్యక్షురాలు సరళ ఆధ్వర్యంలో కంది సర్పంచ్ విమల వీరేశం, కల్వేమల్ సర్పంచ్ బక్కమ్మ, బైతోల్ సర్పంచ్ శిరీష, స్వాతి, వందన, వైద్యరాణి, శారతలు అందంగా పేర్చిన బతుకమ్మల చుట్టూ పాటలు పాడుతూ ప్రదక్షిణలు చేశారు. కార్యక్రమంలో ఎంపిడిఓ కోట్లా విశ్వప్రసాద్, లక్ష్మన్‌గౌడ్‌లు పాల్గొన్నారు.

### ఘనంగా వెజ్జీడే దినోత్సవం

ఆరోగ్యకరమైన జీవనశైలిని అనుసరించడానికి ప్రజలను ప్రోత్సహించేందుకు స్విట్జర్లాండ్‌లో అక్టోబర్ 1న స్వస్టైనబుల్ వెజ్జీడే రోజున ఒక రోజుశాకాహారంగా మారింది. 1200 కంటే ఎక్కువ స్థానిక రెస్టారెంట్లు, వ్యాపారాలు ఈ ప్రయత్నాన్ని విజయవంతం చేయడంలో ఒక రోజుకు శాకాహారం మాత్రమే మెనూని అందించారు. 2022 అక్టోబర్ 1న బిజినెస్ క్లాస్ ప్రయాణికులకు కేవలం శాఖాహార భోజనాన్ని అందించడం ద్వారా స్వస్‌వెజ్జీడేలో పాల్గొన్నారు.

# ఇష్టంతో చదివితే ఉన్నత స్థాయి ర్యాంకులు

## సంగారెడ్డి డిఎస్పీ రవీందర్‌రెడ్డి

**సదాశివపేట, అక్టోబర్ 1, ప్రభాతవార్త:** నేటి సమాజంలో ప్రతి విద్యార్థి కష్టపడి, ఇష్టపడి చదివినప్పుడే ఉన్నత స్థాయి ర్యాంకులు సాధిస్తారని సంగారెడ్డి డిఎస్పీ రవీందర్‌రెడ్డి అన్నారు. శనివారం ఉజ్వల జూనియర్ కళాశాల ఫ్రెషర్స్ పార్టీని కళాశాల ప్రిన్సిపాల్ కూచి శ్రీనివాస్ అధ్వర్యంలో స్థానిక దుర్గా ఫంక్షన్ హాల్‌లో ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా హాజరై జ్యోతి ప్రజ్వల్వాన ద్వారా కార్యక్రమాన్ని ప్రారంభించారు. అంతకు ముందు విద్యార్థినీ, విద్యార్థులు స్వాగత ద్వరం నుండి పుష్పగుచ్చాలు అందజేసి స్వాగతించారు. ఈ సందర్భంగా డిఎస్పీ రవీందర్‌రెడ్డి మాట్లాడుతూ ప్రస్తుత సమాజంలో విద్యార్థినీ, విద్యార్థులకు విద్యతోనే సంస్కారం ఏర్పడుతుందని ప్రతి ఒక్క విద్యార్థి కష్టంతోనే కాకుండా ఇష్టంతో చదివినప్పుడే ఉన్నత స్థాయి మార్కులు సాధించవచ్చున్నారు. తరుణంలో కరోనా మహమ్మరి వలన రెండు సంవత్సరాలు అన్‌లైన్ ద్వారా సెల్ఫోన్‌క్లాసులు నిర్వహించారు. ఈ సెల్‌ఫోన్ వలన మంచి చెడులు ఉన్నాయని దానిని ఎక్కువగా వాట్సాప్‌లోని చాటింగ్‌లని విద్యార్థినీ, విద్యార్థులు తమ ఉజ్వల భవిష్యత్తు నాశనం చేసుకుంటున్నారన్నారు. అదే విధంగా కాలంలో సైబర్ నేరగాళ్ళ వలన ఫోన్‌లోని డబ్బులు బ్యాంకు బ్యాలెన్స్‌లు మాయం చేస్తున్నారని సైబర్ నేరగాళ్ళ పట్ల



ప్రతిభ కనబరిచిన విద్యార్థినికి సిల్వర్ మెడల్స్ అందజేస్తున్న డిఎస్పీ

అప్రమత్తంగా ఉండాలన్నారు. విద్యార్థులు క్రమశిక్షణ రహితంగా ఉండి ఇష్టంతో చదివినప్పుడే మీరు లక్ష్యాలను చేరుకుం టారన్నారు. విద్యతోనే విలువలు పెరుగుతాయన్నారు. అనంతరం విద్యార్థినీ, విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆటపాటలు ప్రతిభావంతులకు ప్రథమ, ద్వితియ, తృతీయ బహుమతులు అతిథుల చేతుల మీదుగా అందజేశారు. ఈ కార్యక్రమంలో పట్టణ సిఐ నవీన్‌కుమార్, కళాశాల కరస్పాండెంట్ వెంకటేశం, డైరెక్టర్లు రఘువర్ధన్‌రెడ్డి, అమరేందర్‌రెడ్డి, నీలకంతం, లెక్చరర్లు నరేష్, సునిత, అనురాధ, ప్రసన్న, బ్రహ్మాచారి, ప్రియాంక, తస్లీమ్, నరేందర్‌రెడ్డి, నర్సిములు, రాజు, శ్రీకాంత్, విద్యార్థులు పాల్గొన్నారు.



బతుకమ్మ సంబురాలు జరుపుకుంటున్న మహిళల దృశ్యం

## ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో బతుకమ్మ సంబురాలు

**జిన్నారం, అక్టోబరు 1, ప్రభాతవార్త:** బొల్లారం మున్సిపాలిటీ పరిధిలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో శనివారం బతుకమ్మ సంబారాలు జరుపుకున్నారు. తీరు తీరు పువ్వులతో పేర్చి రంగులు అద్ది అందంగా తయారు చేసిన బతుకమ్మల చుట్టూ బొల్లారం మున్సిపాలిటీ చైర్మన్ కొలన్ రరోజా బాల్‌రెడ్డి ఆధ్వర్యంలో ఆస్పత్రి బాధ్యులు పాల్గొని పాటలు పాడుతూ బతుకమ్మల చుట్టూ ప్రదక్షిణలు వేశారు. కార్యక్రమంలో ఆస్పత్రి డాక్టర్ ఫణి, పిహెచ్‌ఎన్ స్వరూప, ఎఎన్‌ఎం, ఆశా వర్కర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

## సిఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ

**ఝరాసంగం, అక్టోబరు 1, ప్రభాతవార్త:** మండలంలోని బర్దీపూర్ గ్రామానికి చెందిన సిహెచ్ వినోదమ్మ, జి సవిత కుటుంబ సభ్యులకు శనివారం ఎమ్మెల్యే కొనింటి మాణిక్‌రావు సిఎంఆర్‌ఎఫ్ చెక్కులను పంపిణి చేశారు. జహీరాబాద్ పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో గ్రామానికి చెందిన నర్సింలు, శ్రీశైలంలకు 60వేల రూపాయల చొప్పున ఇరువరికి 1లక్ష 20వేల రూపాయల చెక్కులను అందచేశారు. కార్యక్రమంలో మాజీ మండల అధ్యక్షులు సంగమేశ్వర్, గ్రామ సర్పంచ్ కృష్ణ, ఎంపిటిసి సభ్యులు రాజు తదితరులు ఉన్నారు.

## లక్ష్మీదేవిగా ముమ్మాదేవి దర్శనం

**రాయికోడ్, అక్టోబరు 1, ప్రభాతవార్త:** మండల కేంద్రమన రాయికోడ్‌లోని ముమ్మాదేవి ఆలయంలో దేవి శరన్నవరాత్రి ఉత్సవాలు ఘనంగా కొనసాగుతున్నాయి. శనివారం ముమ్మాదేవిని లక్ష్మీదేవిగా అలంకరించి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. మండలంలోని ఆయా గ్రామాల భక్తులు ఆలయానికి చేరుకుని పూజా కార్యక్రమాలు నిర్వహించారు.

## చెక్కులు అందజేసిన ఎంపి బిబి పాటిల్



సిఎంఆర్‌ఎఫ్ చెక్కులు అందిస్తున్న దృశ్యం

**జహీరాబాద్, అక్టోబరు 1, ప్రభాతవార్త:** జహీరాబాద్ పట్టణానికి చెందిన నాజియ ఇర్ఫత్ అనారోగ్యానికి గురికావడంతో మెరుగైన చికిత్స కోసం బాధిత కుటుంబ సభ్యలకు ఎంపి బిబి పాటిల్ సిఎంఆర్‌ఎఫ్ చెక్కును అందించారు. 2లక్షల 50వేల రూపాయల చెక్కును బాధితురాలి కుటుంబ సభ్యులకు అందచేశారు. కార్యక్రమంలో టిఆర్‌ఎస్ నాయకులు షేఖ్ ఫరీద్, కోహీర్ ఎంపిటిసి సభ్యులు హన్నస్ జావెద్ తదితరులు పాలొన్నారు.

## మాచ్‌నూర్‌లో బతుకమ్మ చీరల పంపిణీ

**సంగారెడ్డి, అక్టోబరు 1, ప్రభాతవార్త:** మండలంలోని మాచ్‌నూర్ గ్రామంలో శనివారం మహిళలకు బతుకమ్మ చీరలను పంపిణి చేశారు. గ్రామంలోని పంచాయితీ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ రాజు ఆధ్వర్యంలో చీరలను అందచేశారు. కార్యక్రమంలో పంచాయితి కార్యదర్శి అశ్విని, గ్రామ ఉప సర్పంచ్ శోభమ్మ, ప్రజాప్రతినిధులు, నాయకులు రాజు, పుండరీకం పాటిల్, దేవపుత్ర, జగన్నాథం, ఆంద్రయ్య, రేషన్ డీలర్ సుజత్ అలీ తదితరులు పాల్గొన్నారు.

## ఉద్యోగులను క్రమబద్ధీకరించాలి



ఎమ్మెల్సీ కవితకు వినతి పత్రం ఇస్తున్న ఉద్యోగుల దృశ్యం

**పాపన్నపేట, అక్టోబరు 1, ప్రభాతవార్త:** గ్రామీణాభివృద్ధి శాఖలో విధులు నిర్వహిస్తున్న కాంట్రాక్టు ఉద్యోగులను క్రమ బద్ధీకరించాలంటూ ఉద్యోగులు ఎమ్మెల్సీ కవితికు వినతి పత్రం అందచేశారు. శనివారం ఏడుపాలయ వనదుర్గా భవాని మాత ఆలయానికి హాజరయిన సందర్భంగా హరిత రెస్టారెంట్‌లో ఎమ్మెల్సీ కవితికు వినతి పత్రం అందచేశారు. వినతి పత్రం అందుకున్న కవితి సానుకూలంగా స్పందించినట్లు ఉద్యోగులు పేర్కొన్నారు.

## ఎమ్మెల్యేను కలుసుకున్న టిఆర్‌ఎస్‌ఎంఏ సభ్యులు

**జహీరాబాద్, అక్టోబరు 1, ప్రభాతవార్త:** ప్రయివేటు పాఠశాలల యాజమాన్యాల సంఘం నూతనంగా ఎన్నికైన కార్యవర్గ సభ్యులు శనివారం స్థానిక ఎమ్మెల్యే కొనింటిమాణిక్‌రావును కలుసుకున్నారు. పట్టణంలో ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో మర్యాద పూర్వకంగా ఎమ్మెల్యేను కలుసుకుని శాలువాత సత్కరించారు. నూతనంగా ఎన్నికైన సభ్యులకు ఎమ్మెల్యే సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు దశరథ్‌రెడ్డిర, టి కృష్ణరెడ్డి, మహమ్మద్ ముజమీద్, సునీల్‌కుమార్, అయ్యప్పరెడ్డి, క్రిష్ణఫర్ పాల్గొన్నారు.

## అరబిందో కంపెనీలో జరిగిన ప్రమాదంపై విచారణ జరిపించాలి

**సంగారెడ్డి మున్సిపాలిటీ, అక్టోబర్ 1, ప్రభాతవార్త:** అరబిందో పరిశ్రమలో జరిగిన ప్రమాదంపై ఉన్నత అధికారులతో విచారణ జరిపించాలని సిపిఎం జిల్లా కార్యదర్శి గొల్లపల్లి జయరాజు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం ఓ ప్రకటనలో విడుదల చేశారు. అరబిందో పరిశ్రమలో భద్రత ప్రమాణాలు సరిగా లేకపోవడం వల్లనే ప్రమాదం జరిగినట్లుగా అనుమానాలు వస్తున్నాయని అన్నారు. ఈ ప్రమాదంలో అనేకమంది గాయపడి చికిత్స పొందుతున్నారని వారందరికీ మెరుగైన వైద్యం అందించాలని డిమాండ్ చేశారు. దీనిపైన ఉన్నత అధికారులు తక్షణమే విచారణ జరిపి యాజమాన్యంపై కఠిన చర్యలు తీసుకోవాలని అన్నారు.



హమాలీలకు దసరా బోనస్‌ను ఇస్తున్న జిల్లా కలెక్టర్ శరత్, చింతా ప్రభాకర్

## హమాలీలకు దసరా బోనస్ అందజేత

**సంగారెడ్డి బ్యూరో, అక్టోబర్ 1, ప్రభాతవార్త:** జిల్లా పౌర సరఫరాల సంస్థలో పనిచేస్తున్న మహలీలకు జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ శరతన, రాష్ట్ర హ్యాండ్లూమ్స్ కార్పొరేషన్ చైర్మన్ చింతా ప్రభాకర్, అనదపు కలెక్టర్ వీరారెడ్డి తో కలిసి శనివారం తన ఛాంబర్లో దసరా బోనస్ అందించారు. జిల్లా పౌర సరఫరాల సంస్థ బియ్యం గోడౌన్లలో పనిచేస్తున్న 69 మంది హమాలీలకు, 6 గురు స్వీపర్లకు ఒక్కొక్కరికి రూ. 6,200 చొప్పున మొత్తం రూ. 4.65 లక్షల దసరా బోనస్‌ను అందించారు. సంబందితులకు వారి ఖాతాలలో రూ. 5,500 లు జమచేసినట్లు రూ. 700 ల స్వీట్ బాక్స్‌ను, కొత్త బట్టలను అందజేశారు. ఈ సందర్భంగా హమాలీలకు చింతా ప్రభాకర్, జిల్లా కలెక్టర్ దసరా శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్, వీరారెడ్డి, సివిల్ సప్లైస్ కార్పొరేషన్ డి ఎం సుగుణ బాయి, డిసిసిబి వైస్ చైర్మన్ మాణిక్యం, జిల్లా సివిల్ సప్లైస్ కార్పొరేషన్ హమాలీల అధ్యక్షుడు రాజయ్య, కార్యదర్శి ఎస్‌కె బాబు మియా, హమాలీలు తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వానికి గిరిజనుల కృతజ్ఞతలు

**జహీరాబాద్, అక్టోబరు 1, ప్రభాతవార్త:** గిరిజనుల అభివృద్ధి కొరకు టిఆర్‌ఎస్ ప్రభుత్వం 6 శాతం నుంచి 10 శాతానికి రిజర్వేషన్‌లు పెంచడం పట్ల గిరిజనులు సంబరాలు చేసుకున్నారు. పట్టణంలోని జాతీయ రహదారిపై గల అంబేద్కర్ విగ్రహం వద్ద గిరిజన నాయకులు, మాజీ కౌన్సిలర్ మోతీరాం రాథోడ్ ఆధ్వర్యంలో అంబేద్కర్ విగ్రహానికి పూల మాలలు వేసి సంతోషం పంచుకున్నారు. ఈ సందర్భంగా క్యాంప్ కార్యాలయంలో ఎమ్మెల్యే కొనింటి మాణిక్‌రావును శాలువాతో సత్కరించి ముఖ్యమంత్రి కేసిఆర్‌కు, ఎమ్మెల్యేకు కృతజ్ఞక్షతలు తెలిపారు. కార్యక్రమంలో టిఆర్‌ఎస్ పట్టణ అధ్యక్షులు సయ్యద్ మోహియోద్దిన్, సర్పంచుల ఫోరం అధ్యక్షులు శెట్టి రాథోడ్, గిరిజన నాయకులు హీరు రాథోడ్, విజయ్ రాథోడ్, మోహన్ చవాన్, ఉమేష్ లాల్, రాంశెట్టి, గోపాల్, శంకర్, ప్రేమ్‌సింగ్, బీంసింగ్, వాసు పవార్, శ్రీనుపవర్, గులాల్‌సింగ్, మధు, తులసీరాంరాథోడ్, తులజీరామ్, లక్ష్మన్, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

## శ్రీ మహాలక్ష్మి ఆలంకారణలో బంగారు మైసమ్మ

**సదాశివపేట, అక్టోబర్ 1, ప్రభాతవార్త:** సదాశివపేటలో శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా శనివారం ఆరవ రోజు శ్రీ మహాలక్ష్మి ఆలంకరణలో బంగారు మైసమ్మ దర్శించారు. సుప్రభాత సేవలో మేలుకొలిపి మండపారాధన అమ్మవారికి మూల విరాట్ విగ్రహానికి పంచామృత స్నానాభిషేకము, శ్రీసుక్త సహిత హోమం, నైవేద్యం, మహా మంగళహారతి నిర్వహించినట్లు ఆలయ అర్చకులు నగేష్‌స్వామి తెలిపారు. మహా మంగళ హారతి పర్యంతం వచ్చినటువంటి భక్తులు అమ్మవారిని దర్శించుకుని అన్నప్రసాద నైవేద్యం స్వీకరించి భక్తులు మొక్కులు చెల్లించుకున్నారు. ఈ కార్యక్రమంలో అలయ కమిటి సభ్యులు, అర్చకులు, భక్తులు పాల్గొన్నారు.

## బోర్పట్ల డబుల్ బెడ్ రూమ్ సిమెంట్ పలకలు ధ్వంసం

**సంగారెడ్డి, అక్టోబర్ 1, ప్రభాతవార్త:** హత్నూర మండలం బోర్పట్ల గ్రామంలో నిర్మిస్తున్న డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల స్థలం విషయంలో తమకు న్యాయం చేయాలని బోర్పట్ల గ్రామానికి చెందిన జక్క మల్లేశం జిల్లా అధికారులను వేడుకున్నారు. తమకు కేటాయించిన ప్రభుత్వ స్థలంలో గ్రామానికి చెందిన టీఆర్‌ఎస్ నాయకుడు అక్రమంగా లాక్కుంటున్నాడని, గ్రామానికి చెందిన జక్క మల్లేశం ఆగష్టు నెలలో ప్రజావాణిలో కిరోసిన్ పోసుకొని ఆత్మహత్యకు పాల్పడిన విషయం తెలిసిందే. జక్క మల్లేశం తన స్థలం అంటూ వాదిస్తున్న చోట శనివారం డబుల్ బెడ్ రూమ్ నిర్మాణం కొరకు సిమెంట్ పలకలతో ప్రహరి నిర్మాణం మొదలుపెట్టగా వాటిని ధ్వంసం చేశారు. గ్రామానికి చెందిన టీఆర్‌ఎస్ నాయకుడు కావాలనే డబుల్ బెడ్ రూమ్ పేరుతో తన భూమిని లాక్కుంటున్నడని తనకు న్యాయం చేయాలని బాధితుడు జక్క మల్లేశం ఉన్నతాధికారులకు వేడుకుంటున్నాడు.

## మున్సిపల్ సిబ్బందికి నూతన వస్త్రాలు అందజేత



నూతన వస్త్రాలను అందజేస్తున్న శ్యామ్ రావు

**రామచంద్రాపురం, అక్టోబర్ 1, ప్రభాతవార్త:** రామచంద్రాపురం మండలం తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని ఉస్మాన్‌నగర్ మున్సిపల్ సిబ్బంది, తెల్లాపూర్ మున్సిపాలిటీ కంప్యూటర్ ఆపరేటర్లకు, బిల్ కలెక్టర్లకు, కార్మికులకు శనివారం తెల్లాపూర్ మున్సిపాలిటీ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు శ్యామ్ రావు ఆధ్వర్యంలో దసరా పండుగ సందర్భంగా నూతన వస్త్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విజయదశమి పండుగను పురస్కరించుకొని తనవంతుగా మున్సిపాలిటీ పరిధిలో పనిచేస్తున్న సిబ్బందికి నూతన వస్త్రాలను అందజేయడం జరిగిందన్నారు. దసరా పండును ప్రజలందరూ కలిసి మెలిసి ఆహ్లాదకరమైన వాతావరణంలో ఆనందంగా, సంతోషంతో జరుపుకోవాలని కోరారు.

## మునిపల్లిలో బతుకమ్మ చీరల పంపిణీ

**సంగారెడ్డి, అక్టోబర్ 1, ప్రభాతవార్త:** మునిపల్లిలో మండలంలోని పోల్కంపల్లి, ఖమ్మంపల్లి, మునిపల్లి, బోడపల్లి గ్రామాలలో అందోల్ ఎమ్మెల్యే చంటి క్రాంతి కిరణ్ సూచన మేరకు మునిపల్లి ఎంపిడివో రమేష్ చంద్ర కులకర్ణి, మునిపల్లి జెడ్పిటీసీ పైతరమీనాక్షిసాయికుమార్, ఎంపీపీ శైలజా శివశంకర్, తెరాస నాయకులతో కలిసి తెలంగాణ ఆడపడుచులకు బతుకమ్మ చీరలు పంపిణీ చేయడం జరిగింది. ఈ సందర్భంగా జెడ్పిటీసీ పైతర మీనాక్షిసాయికుమార్, ఎంపీపీ శైలజా శివశంకర్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి కేసీఆర్ కృషితో మునుపెన్నడూ లేనివిధంగా ఆడపడుచులకూ పుట్టింటి పట్టుచీరలా బతుకమ్మ పండుగకు చీరలు పంపిణీ చేయడం హర్షణీయమని తెలంగాణ ప్రభుత్వం ఏర్పడ్డ తర్వాతే పండుగలకు గౌరవం దక్కిందన్నారు. తెలంగాణ రాష్ట్ర నాయకులు పైతర సాయికుమార్, మండల పార్టీ అధ్యక్షులు వారణాసి సతీష్ కుమార్, ఎంపిటీసీ శివలీల, సర్పంచ్ రమేష్, సర్పంచ్ జాస్మిన్-గుడ్డుపటేల్, బిందురామక్రిష్ణ, నాగమని పాల్గొన్నారు.



అమ్మవారిని పూజిస్తున్న మాజీ ప్రజాప్రతినిధుల దృశ్యం

## కేబిఆర్ కాలనీలో నాయకులు పూజలు

**జిన్నారం, అక్టోబరు 1, ప్రభాతవార్త:** బొల్లారం మున్సిపాలిటీ పరిధిలోని కేబిఆర్ కాలనీలో కొనసాగుతున్న దేవి నవరాత్రి ఉత్సవాల్లో శనివారం మాజీ ప్రజాప్రతినిధులు పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అమ్మవారి మండపం వద్ద నాయకులు ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమంలో భక్తులు పాల్గొని ప్రసాదాన్ని స్వీకరించారు. కార్యక్రమంలో మాజీ జడ్పీటిసి సభ్యులు కలన్ బాల్‌రెడ్డి, కౌన్సిలర్ బీరప్ప యాదవ్, టిఆర్‌ఎస్ నాయకులు జైపాల్‌రెడ్డి, గుండ్ల మహేందర్‌రెడ్డి, విజయ్‌రెడ్డి, శేషరెడ్డి, మాజీ ఎంపిటిసి సభ్యులు యాదగిరి, నాయుడు, రత్నం, ఉత్సవ కమిటి బాధ్యులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్‌లో చేరిన టిఆర్‌ఎస్ నాయకులు

**-నియోజకవర్గ కాంగ్రెస్ ఇంచార్జి కాటా శ్రీనివాస్‌గౌడ్**



కండువాలు కప్పి కాంగ్రెస్‌లోకి ఆహ్వానిస్తున్న శ్రీనివాస్‌గౌడ్

**జిన్నారం, అక్టోబరు 1, ప్రభాతవార్త:** రెండు మార్లు టిఆర్‌ఎస్‌కు అవకాశం కల్పించినా ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు చేసిన హామీలను అమలు చేయడంలో విఫలం కావడం, వచ్చే శాసన సభ ఎన్నికల్లో రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడం ఖాయమం అయినందున టిఆర్‌ఎస్ పార్టీ నాయకులు కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నారని కాంగ్రెస్ పార్టీ పటాన్‌చెరువు నియోజకవర్గ ఇంచార్జి కాటా శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. శనివారం మండలంలోని లక్ష్మీగూడెంలో ఎంపిపి అధ్యక్షులు రవీందర్‌గౌడ్ సమక్షంలో టిఆర్‌ఎస్ గ్రామ కమిటి మాజీ అధ్యక్షులు పట్నం మల్లేశ్, నాయకులు కుమ్మరి అశోక్, పట్నం వినోద్ కుమార్, కుమ్మరి ప్రశాంత్, అంబటి నిరంజన్, కుమ్మరి శ్రీకాంత్, భవాని గణేష్, శ్రీకాంత్, దుంపల విజయ్‌కుమార్ తదితరులు కాంగ్రెస్ పార్టీలో చేరినట్లు ఆయన ప్రకటించారు.

## ఎస్టీ గురుకులాల్లో ఉద్యోగాల కొరకు దరఖాస్తుల ఆహ్వానం

**నారాయణఖేడ్, అక్టోబర్ 1 ప్రభాతవార్త:** సంగారెడ్డి జిల్లాలోని ఆయా ఎస్టీ గురుకులాల్లో ఔట్ సోర్సింగ్ ఉద్యోగాల పోస్టుల ఖాళీల భర్తీ కొరకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ఆశాఖ ఆర్సీఓ కల్యాణ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నిరుద్యోగ యువతీ యువకుల కొరకు కేర్ టేకర్, నర్సు పోస్టుల కొరకు అభ్యర్థులు దరఖాస్తులు చేసుకోవాలని ఆమె సూచించారు. ఆసక్తి ల వారు హైదరాబాద్‌లోని రాజేంద్రనగర్ రంగారెడ్డి జిల్లాలోని రీజినల్ ప్రాంతీయ కార్యాలయంలో ఈనెల 8వ తేది లోపు దరఖాస్తులు చేసుకోవాలని అన్నారు. అభ్యర్థులు ఎ.ఎన్‌ఎం. స్టాఫ్ నర్సు, హోటల్ మేనేజ్‌మెంటు కోర్సులు చేసిన వారు అర్హులన్నారు. మిగతా వివరాలకు సెల్‌నెం.7382931496 కు సంప్రదించాలని అన్నారు.

## దుర్గమాతను దర్శించుకున్న ఎమ్మెల్యే

**నారాయణఖేడ్, అక్టోబర్ 1 ప్రభాతవార్త:** దుర్గామాత నవరాత్రులను పురస్కరించుకుని నారాయణఖేడ్ మండల పరిధిలోని సంజీవన్‌రావుపేటలో దుర్గామాత ఆలయంలో నారాయణఖేడ్ ఎమ్మెల్యే ఎం. భూపాల్‌రెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించారు. శనివారం గ్రామంలోని మన ఊరు మనబడి కార్యక్రమంలో భాగంగా జిల్లా పరిషత్ హైస్కూల్‌కు రూ.35 లక్షలు, ప్రైమరీ పాఠశాలకు రూ.11 లక్షలు మంజూరయ్యాయి. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఎం.భూపాల్‌రెడ్డి భూమి పూజ చేశారు. జడ్పీటీసీ సభ్యురాలు లక్ష్మిబాయి రవీందర్‌నాయక్, ఎంపీపీ తనయుడు రమేష్‌చౌహాన్ ఎంపీటీసీ భూపాల్, సర్పంచ్ ఎంబరి విఠల్, మాజీ మండల పార్టీ అధ్యక్షులు సాయిరెడ్డి, జూజల్‌పూర్ సర్పంచ్ జైపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

## సబ్సిడీపై శనగ విత్తనాలు

**నారాయణఖేడ్, అక్టోబరు 1 ప్రభాతావార్త:** నారాయణఖేడ్ నియోజవర్గంలోని ఆయా గ్రామాల రైతుల కొరకు ప్రభుత్వం సబ్సిడీపై శనగ విత్తనాలు సరఫరా చేసిందని నారాయణఖేడ్ ఏడిఏ కరుణరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ శనగ విత్తనాలు కావలసిన రైతులు నారాయణఖేడ్‌లోని అగ్రోస్ ఫర్టిలైజర్ దుకాణంలోకి వెళ్లి తీసుకోవచ్చున్నారు. రైతులు తమ ఆధార్‌కార్డు, పట్టాదార్ పాస్‌బుక్కు తీసుకెళ్లాలని సూచించారు. 25 కిలోల బస్తా ధర రూ.1750తో శనగ విత్తనాల బ్యాగులు ఉన్నాయని అన్నారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన అన్నారు.

## ఘనంగా స్ట్రక్చరల్ ఈక్వేషన్ మోడలింగ్

**-14,15న ఆన్‌లైన్‌లో వికాస కార్యక్రమం**

**పటాన్‌చెరువు, అక్టోబరు 1, ప్రభాతవార్త:** గీతం బీ-స్కూల్, హైదరాబాద్‌లోని అకౌంటింగ్ విభాగం ఆధ్వర్యంలో ఈనెల 14, 15వ తారీఖులలో ఎస్ఎస్‌పిఎస్-ఏఎంవోఎస్‌ని వినియోగించి స్ట్రక్చరల్ ఈక్వేషన్ మోడలింగ్‌పై ఆన్‌లైన్ ఆధ్యాపక వికాస కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు బీ-స్కూల్ డైరెక్టర్ డాక్టర్ కరుణాకర్ బి శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పీజీ విద్యార్థులు, రీసెర్చ్ స్కాలర్లు, అధ్యాపకులు, కార్పోరేట్ ఎగ్జిక్యూటీవ్‌లు, ఇండస్ట్రీ ప్రాక్టీషనర్లు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో పాల్గొనే వారు ఎస్‌పిఎస్‌ఎస్‌తో గణాంక సాధనపై ప్రాథమిక అవగాహన ఉండాలని ఎస్‌పిఎస్‌ఎస్-ఏఎంవోఎస్ లోడ్ చేసిన కంప్యూటర్లు ఉండాలన్నారు. లక్నో విశ్వవిద్యాలయంలోని గణాంక విభాగాధిపతి ప్రొఫెసర్ మసూద్ హెచ్ సిద్ధిఖీ, లండన్‌లోని అనలిటిక్స్ ఇన్‌స్టిట్యూట్ జాతీయ అధిపతి డాక్టర్ వినోద్ కుమార్ మూర్తి, కార్యక్రమ నిర్వాహకులు డాక్టర్ గుత్తి ఆర్‌కే ప్రసాద్‌లు ప్రధాన వక్తలుగా 12గంటల పాటు నిర్వహించే ఆన్‌లైన్-డైరెక్టు డివైస్ మోడ్‌లో నిర్వహించే ఎఫ్‌డీపీలో పాల్గొంటారని కరుణాకర్ ప్రకటించారు.

## ప్రకృతిని ఆరాధించే పండుగ బతుకమ్మ

**సంగారెడ్డి బ్యూరో, అక్టోబర్ 1, ప్రభాతవార్త:** పూలను పూజించే, ప్రకృతిని ఆరాధించే పండుగ బతుకమ్మ అని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ, జిల్లా ఖజానా శాఖ అధికారినులు డాక్టర్ గాయత్రిదేవి, కవిత లు పేర్కొన్నారు. బతుకమ్మ ఉత్సవాలలో భాగంగా శనివారం కలెక్టరేట్ ఆవరణలో రెవెన్యూ, సహకార, వైద్య ఆరోగ్యశాఖ, ఖజానా శాఖల సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన "వేపకాయల బతుకమ్మ" ఉత్సవం ఘనంగా జరిగింది. రంగురంగుల తీరొక్క పూలతో పేర్చిన బతుకమ్మలను భక్తితో కొలిచి ఆయా శాఖల మహిళా అధికారులు, ఉద్యోగినులు, బస్తీ వాసులు ఆనందోత్సాహాలతో బతుకమ్మ ఉత్సవాలను పాల్గొని ఆడి పాడారు. ఉత్సవాలలో జిల్లా మహిళా అధికారులు, వివిధ శాఖల మహిళా ఉద్యోగినులు, కాలనీ మహిళలు, స్వయం సహాయక సంఘాల మహిళలు తదితరులు పాల్గొన్నారు.